జడ్పీ పాఠశాల ప్రాంగణంలో ఆకతాయిల సంచారం

కాలక్షేపానికి వేదికగా బస్‌షెల్టర్- పోలీసుల జోక్యంతోనే మార్పు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని చిలమకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం ఆకతాయిలకు, మద్యం ప్రియులకు ఉబుసుపోక కాలక్షేపానికి వచ్చి కబుర్లు చెప్పుకొనే వారికి వేదికగా మారినట్లు స్థానిక ప్రజలు ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్న తీరు చర్చకు దారితీసింది. హైస్కూలు ప్రాంగణంలోనే నీటి శుద్ధి కేంద్రం కూడా ఉండడంతో తాగునీటి కోసం వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. దీనికి తోడు ఈ ప్రాంగణంలోనే బాలికల జూనియర్ కళాశాల కూడా ఈ యేదాది ప్రారంభమైంది. దీంతో ఈ ప్రాంతం విద్యార్థినీ విద్యార్థులతో రద్దీగా ఉంటుంది. ఇదే అదునుగా భావించిన కొంతమంది ఆకతాయి యువకులు ఇక్కడి బస్‌షెల్టర్‌లో కూర్చుని వచ్చే పోయే బాలికలపై సెటైర్లు సంధిస్తూ మానసిక ఆనందం అనుభవిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. శుద్ధి నీటి కోసం వచ్చే యువకులు కూడా తమ ద్విచక్రవాహనాలను ఇక్కడే నిలిపి వాటిపై కూర్చుని ధూమపానం సేవిస్తూ కనిపించడం పరిపాటిగా మారింది. రాత్రి సమయాల్లో హైస్కూలు ప్రాంగణంలోనే మద్యం సేవించడం కూడా జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే అంశాన్ని శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు కొండయ్య సభ దృష్టికి తేవడం విదితమే. పారిశ్రామిక వాడ కావడంతో చిలమకూరులో అన్ని వర్గాల ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో బాలికలకు, మహిళలకు రానురాను రక్షణ కరువవుతోందన్న వాదన నెలకొంది. ఇదే హైస్కూలు ప్రాంగణం ముందు భాగాన ప్రధాన రహదారి పక్కన ఇది వరకు పోలీసు ఔట్‌పోస్టు కేంద్రం కొనసాగింది. ఇక్కడ ఒకరిద్దరు పోలీసు సిబ్బంది ఉండి విధులు నిర్వహించేవారు. అప్పట్లో కాలక్షేప రాయుళ్ల, ఆకతాయిల ఆగడాలు ఉండేవికావు. ఈమధ్య కాలంలో ఈ కేంద్రంలో పోలీసులు కనిపించకపోవడంతోపరిస్థితి అదుపుతప్పుతోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. చిలమకూరులో అసాంఘీక కార్యకలాపాలకు కరువులేదు. సామాన్య, మధ్యతరగతి కార్మికుల సంఖ్య అధికంగా ఉండడంతో అవి రాజ్యమేలుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు కొండయ్య ప్రస్తావించిన అంశంపై మండల విద్యాధికారి శివప్రసాద్ మాట్లాడుతూ అక్కడి పరిస్థితిని చక్కదిద్దుతామని సమాధానం ఇచ్చి ఉన్నారు. ఆ మేరకు ఎంఈఓ పోలీసు శాఖతో చర్చించిన దాఖలాలు లేవు.పోలీసుల జోక్యంతోనే ఇక్కడి పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. అలాకాని పక్షంలో ఆకతాయిల ఆగడాలు శృతి మించి ముఖ్యంగా జూనియర్ కళాశాలకు వెళ్లే బాలికలకు రక్షణ కరువవుతుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మండల అధికారులతో నిమిత్తం లేకుండా అక్కడి పరిస్థితిపై క్షేత్రస్థాయిలో చర్యలకు ఉపక్రమించాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉంది. మరి ఆ దిశగా పోలీసుల అడుగులు ఉంటాయని ఆశిద్దాం.

ప్రకృతి సంపదపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-పులివెందుల: ప్రతి ఒక్కరూ ప్రకృతి సంపదపై అవగాహన కలిగి ఉండాలని ప్రధానాచార్యులు వందన పేర్కొన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం హరిత భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందన మాట్లాడుతూ ప్రకృతి వనరుల తో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నా రు. ఇందులో వృక్ష సంపద అత్యంత ప్రధానమైనదన్నారు. చెట్ల వల్ల వర్షాలు వస్తాయని, దీని వల్ల మానవాళి మనుగడ సాధ్యమవుతుం దన్నారు. చెట్లు వర్షాలకు నెలవని, వర్షాలు సంమృద్ధిగా వస్తే వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులు పెంపొందించు కునే అవకాశం ఉంటుం దన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కను నాటి వాటి సంరక్షణా బాధ్యత చేపట్టాలన్నారు. కనీసం మూడు లేదా నాలుగు సంవత్సరాలు వాటిని వృక్షాలుగా అవతరించే వరకు కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విరివిగా చెట్లు ఉంటే భావితరాలకు చక్కటి వాతావరణం అందించిన వారమవు తామని వెల్లడించారు. అలాగే జంతుజాలం గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో భాగంగా హరిత భారత్ అనే అంశంపై వక్తృత్వపు పోటీలు, వ్యాసరచన పోటీలు చిత్రలేఖన పోటీలు నిర్వహించి పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు అలాగే హరిత భారత్ అనే అంశానికి సంబంధించి వివిధ రకాల మొక్కల రూపంలో ప్రదర్శించిన వేషధారణ ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఉప కథానాచార్యులు శివ కుమార్‌తో పాటు ఉపాధ్యాయ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల బదిలీలు చేపట్టండి

విశాలాంధ్ర-పీలేరు:- రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల బదిలీలను చేపట్టాలని వి.సి కె పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు, ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తేజ, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు బోధనేతర సిబ్బంది బదిలీలను అట్టహాసంగా చేసి విజయవంతం చేశారని అన్నారు. అయితే ఆయా కళాశాలలోపని చేస్తున్న అధ్యాపకులు సాధారణ బదిలీలో వచ్చిన సందర్భంగా అక్కడ పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు డిస్టర్బ్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఒప్పంద అధ్యాపకులకు గత 12 సంవత్సరాల నుంచి ఆయా కళాశాలలోనే పనిచేస్తున్నారని రెగ్యులర్ అధ్యాపకులతో పాటు ఒప్పంద అధ్యాపకులను కూడా బదిలీలు చేపడితే పారదర్శకంగా ఉండడమే కాకుండా ఎక్కువ శాతం ఒప్పంద అధ్యాపకులకు అనుకూలమైన కళాశాలలో ఆయా సబ్జక్ట్ లకు అవకాశాలు దొరుకుతాయాని అన్నారు. వెంటనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యా శాఖ మంత్రి బోత్స సత్యనారాయణ ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి స్పందించి ఒప్పంద అధ్యాపకులకు బదలీల ప్రక్రియను చేపట్టాలని వారు తెలిపారు.

ఆపదలో ఆదుకోవడమే మానవతా లక్ష్యం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : ఆపదలో ఉన్న వారిని ఆపన్న హస్తంలా ఆదుకోవడమే మానవతా ముఖ్య ఉద్దేశమని కేంద్ర కమిటీ మానవత సభ్యులు సహదేవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక ఎంపీడీవో సభా భవనంలో నిర్వహించిన మానవతా నూతన కార్యవర్గ సమావేశానికి సహదేవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవతా సభ్యులు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సంస్థను సమిష్టి కృషితో ముందుకు తీసుకెళ్లి పేద ప్రజలకు అండగా నిల్చునే విధంగా కృషి చేయాలన్నారు. లక్కిరెడ్డిపల్లి మానవతా ఆధ్వర్యంలో ఇప్పటికే నాలుగు బాడీ ఫ్రిజర్లు, ఒక శాంతి రథం అందుబాటులో ఉంచి అకస్మాత్తుగా మరణించిన వారికి అండగా నిలుస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన మాన వతా నూతన కార్యవర్గ ఎంపికలో అధ్యక్ష, ఉపాధ్యక్షులుతో పాటు ఎంపి కైన మిగతావారిని గజమాలతో సత్కరించారు.

మానవతా నూతన కార్యవర్గం ఎంపిక : మానవతా నూతన అధ్యక్షులుగా వి.వి. రమణరావు, మానవతా ఉపాధ్యక్షులుగా ఎం.మల్రెడ్డి, సెక్రటరీగా రాముడు, ట్రెజరర్‌గా రవిశంకర్, జాయింట్ సెక్రటరీగా వాసుదేవుడు, ఈపీ అవేర్నెస్ ఆంజనేయులు, ఏపీ ఎమర్జెన్సీ ఫరీద్ బాబా, ఎడ్యుకేషన్ సుబ్బారెడ్డి, హెల్త్ కృష్ణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కేంద్ర కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా చైర్మన్ బాల సుబ్రహ్మణ్యం, కో చైర్మన్ శివశంకర్ రెడ్డి, కేంద్ర మానవతా సభ్యులు వై.ప్రసాద్ యాదవ్, మానవత సభ్యులు నర సింహారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

విశాలాంధ్ర -సుండుపల్లె : సుండుపల్లె అటవీ అధికారి వివేక్ ముందస్తు సమాచారం మేరకు సానిపాయ రేంజ్ ఆఫీసర్ కె.పీరయ్య ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు 4.30 గంటలకు సానిపాయ రేంజ్, సానిపాయ సెక్షన్, సానిపాయ బీటు పరిధిలో తొట్టి బండ దగ్గర ఎర్ర చందనం దుంగలను అక్రమంగా రవాణాకు సిద్ధం చేస్తున్నారన్న సమాచారం అందుకున్న అన్నమయ్య జిల్లా అటవీ అధికారి వివేక్ వెంటనే సానిపాయ ఎఫ్.ఆర్.ఓ కే.పీరయ్యకు సమాచారం ఇవ్వగా వెంటనే తెల్లవారుజాము నుంచి మాటు వేసి తనిఖీలు చేయగా ఉదయం 9.30 గంటలకు సానిపాయ అటవీ అధికారులు తొట్టి బండ దగ్గరకు చేరుకొని అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 35788 రూపాయలు విలువ గల 76.6 కేజిల 6 ఎర్ర చందనం దుంగలను స్కార్పియో వాహనంను స్వాధీనం చేసుకుని తమిళనాడు రాష్ట్రం తిరుత్తణికి చెందిన దిలీప్ కార్తీక్ అనే తమిళ కూలీని అరెస్టు చేసి స్వాధీనం చేసుకున్న దుంగలను మరియు స్కార్పియో వాహనంను సీజ్ చేసి కేసు నమోదు చేశామని అలానే మరి కొందరు వ్యక్తులు పారిపోయారు అని పారిపోయిన వారి కోసం గాలింపు చర్యలు చేస్తున్నామని పీరయ్య తెలిపారు. అలానే ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సానిపాయ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె. పీరయ్య హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఎఫ్.ఆర్.ఓ కే.పీరయ్య డిఆర్ఓ యస్. రమేష్‌బాబు, యఫ్‌యస్ఓ బాబా సాహెబ్, యఫ్.బీ.ఓలు యస్‌యం సునీర్ బాష,జి. అనిల్ కుమార్, పి.లీల, శ్రీహరీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వైవీయు బీఈడీ పరీక్షలు

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ విద్యార్థులకు ఈనెల 24 వ తేదీ నుంచి ఒకటి,నాలుగు సెమిస్టర్ల పరీక్షలు , సెకండ్ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షలు ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్ ఈశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12:00 వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్స్‌ను తాము చదువుతున్న కళాశాలల నుండి పొందవలసిందిగా సూచించారు. పరీక్షలకు హాల్ టికెట్ తో పాటు కళాశాల ఇచ్చిన గుర్తింపు కార్డును కూడా వెంట తెచ్చుకోవాలని కోరారు. పరీక్షల నిర్వహణకు వైవీయు ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కులసచివులు ఆచార్య వై. వెంకటసుబ్బయ్య మార్గదర్శకంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు.

కురుబ సంఘం అభ్యున్నతికి కృషి

విశాలాంధ్ర-మదనపల్లె: సమాజంలో కురుబల గౌరవాన్ని మరింత పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, రాజకీయంగా మరింత పుంజుకునేం దు కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర కురుబ/కురువ సంఘం అధ్యక్షులు, షెపర్డ్స్ ఇండియా ఇంటర్నేషనల్ ఏపీ అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు స్పష్టం చేశారు.ఆదివారం అన్నమయ్య జిల్లా,మదనపల్లి పట్టణం ఎగురువంక, మైసూర్ బ్యాంకు కాలనీలోని రాష్ట్ర కురుబ,కురువ సంఘం కార్యాలయంలో ఆయన అధ్యక్షతన కురుబల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కురుబ కులస్తులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని,అయితే అనుకున్న స్థాయిలో అవకాశాలు లభించలేదన్నారు.ఏపీలో వైకాపా అధికారంలోకి వచ్చి జగన్మో హన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కురుబలకు తగిన ప్రాధాన్యత నిచ్చారన్నారు. తిరుపతిలో కనకదాస భవనం,కనకదాస పీఠం ఏర్పాటు కొరకై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి,ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వారు కూడా స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అత్యవసర సమావేశంలో కురుబ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుకేరి లింగమూర్తి,రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు,రెడ్డి కుమార్,ఈశ్వరయ్య,రాష్ట్ర కార్యదర్శి బేల్ల నాగేంద్ర,ప్రచార కార్యదర్శి విఠల్ గౌడ్,రాష్ట్ర యువత అధ్యక్షులు బి.రమేష్ బాబు,యువత వర్కింగ్ ప్రెసిడెంట్స్ రామకృష్ణ (కర్నూలు),శ్రీనివాసులు (తిరుపతి),చిత్తూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బలరాం గౌడ్,తిరుపతి జిల్లా అధ్యక్షులు మంగిరి రెడ్డెప్ప, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సహదేవ,ఉపాధ్యక్షులు చంద్రశేఖర్,సుండుపల్లి మండల ఉపాధ్యక్షులు ఆంజినేయులు,మదనపల్లి నియోజకవర్గం అధ్యక్షులు కప్పల రాజన్న, పట్టణ అధ్యక్షులు గుడి రామాంజులు, తంబళ్లపల్లి సర్పంచ్ శ్రీనివాసులు, బి.కొత్తకోట సాంబశివ,అమర,కదిరి రాజ్ కుమార్,దుబ్బిగాళ్ల భాస్కర్ , పెద్దఎత్తున కురుబ కులభాంధవులు హాజరయ్యారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకట రమణరాజు



విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సంగరాజు వెంకట రమణరాజు భాద్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రామిరెడ్డి పోరుమామిళ్ల జూనియర్ కళాశాలకి ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు, బదిలీకి ముందు ఓరంపాడు ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న సమయంలోనే వెంకట రమణరాజు పూర్తి అదనపు బాధ్యతలతో ఉమ్మడి కడప జిల్లా ఆర్ఐఓ గా కూడా విధులు కొనసాగిస్తున్నారు. రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఫలితాలలో జిల్లాలోనే అగ్రస్థానం లో నిలుపుతామని, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన మంచి విద్యను అందిస్తామని, కళాశాలకు కావలసిన మౌలిక వసతులను వేగవంతంగా పూర్తి చేస్తామని తెలియజేసారు. అనంతరం కళాశాల అధ్యాపక సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి టిడిపికే సాధ్యం :కస్తూరి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి టిడిపి కే సాధ్యం అని నియోజకవర్గ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు పేర్కొన్నారు.ఆదివారం టిడిపి ప్రధాన కార్యాలయంలో రాయలసీమ అభివృద్ధికి సంబంధించిన మిషన్ రాయలసీమ కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారం లోకి వచ్చిన తర్వాత 5 సంవత్సరాలలో రాయలసీమ ప్రాంతానికి ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధికి కృషి చేస్తామని టిడిపి జాతీయ నాయకులు నారా లోకేష్ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. లోకేష్ ఇచ్చిన హామీలను తెలుగు యువత ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకువస్తా మన్నారు.కర్నూలు వ్యవసాయ పరికరాల హబ్ గా,కడప అంతర్జాతీయ క్రీడలకు స్పోర్ట్స్ యూనివర్సిటీ హబ్ గా, చిత్తూరు ఎలక్ట్రానిక్ వస్తువులు తయారి హబ్ గా, అనంతపురం ఆటో మొబైల్ హబ్ గా ఇలా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి లోకేష్ వ్యూహాత్మకంగా ప్రణాలిక సిద్ధం చేశారన్నారు.నిరుద్యోగ యువతి యువకుల వలసలకు చెక్ పెట్టి ఉపాధి కే ప్రాధాన్యత ఇస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాచినేని విశ్వేశ్వరనాయుడు, కమతం నాగరాజు, గుంటుమడుగు వెంకటేశ్వరరాజు, గడికోట సుబ్బరాయు డు, కొమ్మా శివ,ముక్కర శంకరయ్య,హస్తి చంద్రశేఖర్ రాజు, పోకల మణి, దుద్యాల జయచంద్ర, అనితదీప్తి,మిట్టవీది మధు పాల్గొని కరపత్రాలు విడుదల చేశారు.

అవుట్ సోర్సింగ్, ట్రైనింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఏపిఎండిసి నందు పని చేస్తున్న ఔట్సోర్సింగ్, ట్రైనింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏపిఎండిసి ఎంప్లాయిస్ యూని యన్ జనరల్ సెక్రటరీ పోకూరు మురళి డిమాండ్ చేశారు. మంగంపేటలో ఏపిఎండిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం ప్రాంగణంలో వడ్డి విజయ్ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిఎండిసిలో ఖాళీగా ఉన్న పోస్టులను ఏపిఎండిసి యాజమాన్యమే భర్తీ చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005లోనే తీర్మానం చేసిందన్నారు. సంస్థ యందు పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ట్రైనింగ్ కార్మికులతోనే భర్తీ చేయాలన్నారు.పీస్ రేటు నుండి తక్కువ వేతనంతో రెగ్యులర్ అయిన ఉద్యోగులకు మెరుగైన పేస్కేలు ఇవ్వాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు టి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా ఏపిఎండిసి సంస్థ ప్రైవేటుపరం కాకుండా ఉద్యమాల ద్వారా కాపాడుకున్నామన్నారు. ఔట్సోర్సింగ్ ట్రైనింగ్ కార్మికులను రెగ్యులర్ చేయడానికి చేపట్టే ఉద్యమాలకు ఏఐటియుసి ముందు ఉంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. వడ్డి విజయ్ కృష్ణ మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ ట్రైనింగ్ కార్మికులను రెగ్యులర్ చేయడానికి కార్మికులందరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గురసాల దినేష్ మాట్లాడుతూ లీవులు ఇవ్వాలని యాజమాన్యం దృష్టికి తీసుకుపోయిన డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ అధికారులు ఎర్నడ్ లీవులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ముగ్గురాయి ఉత్పత్తి సంవత్సరానికి సంవత్సరం పెరిగిపోతుండడంతో మైన్ లైఫ్ రోజురోజుకీ తగ్గిపోతుందన్నారు. మైన్ ఉంటేనే చుట్టుపక్కల ప్రజలకు జీవనోపాధి ఉంటుందన్నారు. జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని ముగ్గురాయి ఉత్పత్తిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బత్తల హరి, నారదాసు మణికంఠ, లావులూరి వాసు, నాగార్జున, చంగల్ రాయుడు, మద్దెల నాగార్జున, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గోశాలను ఏర్పాటు చేయడం సంతోషకరం

విశాలాంధ్ర-సిద్దవటం : మూగజీవుల కాపాడేందుకు రాజస్థాన్ సమాజ్ ఆధ్వర్యంలో నీలకంఠేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో గోశాలను ఏర్పాటు చేయడం సంతోషకరమని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా తెలిపారు. మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారిలో కనుములోపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ ఉమాదేవి సమేత శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణలో రాజస్థాన్ సమాజ్ ఆధ్వర్యంలో రూ. 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గోశాలను ఆదివారం డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, సిద్దవటం వైఎస్ఆర్సీపీ మండల ఇంచార్జి మేడా మధుసూదన్ రెడ్డిలు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 శివలింగాలతో కూడిన ఆలయ ప్రాంతంలో గోశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని రాజస్థాన్ వాసులను ఈ సందర్భంగా అభినందించారు. మూగ జీవులను దృష్టిలో ఉంచుకుని గోశాలను ఏర్పాటు చెయ్యడం గొప్ప సంకల్పమన్నారు. ముందుగా మేడా మధుసూదన్ రెడ్డికి రాజస్థాన్ సమాజ్ వారు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం రాజస్థాన్ సమాజ్ వారు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు రిబ్బన్ కట్ చేసి గోశాలను ప్రారంభించారు. పండితులు కైలాష్ శాస్త్రి క్రిష్ణ పూజ, గోపూజ, సురభి పూజలు నిర్వహించిన అనంతరం వారు గోవులకు దానా వేశారు. అలాగే నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకులు సామా బాబు ఆధ్వర్యంలో మండల ఇంచార్జి మేడా మధుసూదన్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏకుల రాజేశ్వరి రెడ్డి, వైఎస్ఆర్సీపీ రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డి, పెద్దపల్లి సర్పంచ్ ప్రతినిధి తుర్రా ప్రతాప్ నాయుడు, పెద్దపల్లి ఉప సర్పంచ్ ప్రతినిధి నాగం నరసింహారెడ్డి, కాడే వెంకట రమణ, మోహన్ రెడ్డి, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ రావుల సుబ్బారెడ్డి, ఉతరామ్, రామ్ సింగ్, శంభు సింగ్, భగవత్ సింగ్, దినేష్ జైన్, అమృత్ జైన్, జీవన్ సింగ్, గణపతి జైన్ పాల్గొన్నారు.

ఘాటు తగ్గని పచ్చి మిరపకాయలు

విశాలాంధ్ర-పులివెందుల: పచ్చిమిరకాలయ ఘాటు తగ్గనేలేదు. నెలరోజులుగా మిరప ధరలు నింగినంటుతున్నాయి. ఇప్పటికీ కిలో వంద రూపాయలకు పైనే క్రయ, విక్రయాలు సాగుతున్నాయి. ధరలు ఎలా ఉన్నా ఈ ఏడాది మిర్చి రైతుకు కాస్త ఊరట లభించింది. కాలం కలిసి రావడంతో మిర్చి రైతుకు ఉపశమనం కలిగింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతన్నకు మిరప పంట బాసటగా నిలిచింది. ఎట్టకేలకు మిరప పంట రైతు ఇంట కాసులు కురిపించింది. దేశానికి కారం పవర్ ఏమిటో రైతన్న రుచి చూపించాడు. ఈ ఏడాది పచ్చిమిరపకాయల ధరలు నింగిని తాకాయి. కిలో 100 నుంచి రూ.150ల వరకు ధరలు పలికాయి. మిర్చి ఘాటెక్క దంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంట పండితే ధర ఉండదు ధర ఉంటే పంట పండదు ఇది చాలా కాలం నుంచి వస్తున్న పరిస్థితి. పచ్చిమిరప ధరలు ఎప్పుడు ఆకాశానికి చేరుతాయో ఎప్పుడు పతనమవుతాయో తెలియని పరిస్థితి ఉంటుంది. ఒకప్పుడు పచ్చిమిరపకాయలు గిట్టుబాటు కాక రోడ్లపైనే పడవేసిన రోజులు కోకొల్లలుగా ఉన్నాయి. ఇదిలావుండగా ఈ ఏడాది

ధరలు పెరగడంతో మిర్చి రైతులకు ఊరట

వేసవిలో విపరీతమైన అధిక ఎండలు ఉష్ణోగ్రతల కారణంగా మిరప సాగు రైతులు చేపట్ట లేకపోయారు. దీంతో మిరపకాయల కొరత తీవ్రస్థాయిలో ఏర్పడింది. కొంతమంది మంది రైతులు మిరప పంట వేసినా అధిక ఎండలు ఉష్ణోగ్రతలకు మొలక దశలోనే పైరు దెబ్బతినింది. దీంతో మరోసారి మిరప పంట సాగు చేయడానికి రైతులు ఉత్సాహం చూపలేదు. పులివెందుల నియోజకవర్గ పరిధిలో 75శాతం మిరప సాగు కావాల్సి ఉంది. కారణాలవల్ల కేవలం 10 నుంచి 15 శాతం మంది మాత్రమే రైతులు మిరప పంట వేశారు. కాగా పులివెందుల ప్రాంతంలో పండించిన మిరపకాయలు ఇతర ప్రాంతాలకు కూడా ఎగుమతి చేస్తారు. మిరప పంట ద్వారా అటు రైతులకు ఇటు కూలీలకు కూడా కాస్త ఉపాధి లభిస్తుంది. దీనివల్ల అటు రైతు ఇటు కూలీ బాగుపడే అవకాశం ఉంది. కానీ వివిధ కారణాలవల్ల మిర్చి సాగు చేయకపోవడంతో మిరపకాయల ధరలు విపరీతంగా పెరిగాయి. ఎంతో కష్టపడి వ్యయ ప్రయాసలకు వచ్చి సాగుచేసిన రైతులకు మాత్రం ఉపశమనం ఇచ్చిందని చెప్పవచ్చు. కాలం అనుకూలించడంతో మిర్చి రైతు దశ తిరిగింది అని కూడా చెప్పవచ్చు. ఏది ఏమైనా చాలాకాలం తర్వాత మిర్చి రైతు ఇంట కాసులు కురిపించాయని చెప్పడంలో సందేహం లేదు.

బడుగుల అభ్యున్నతికే లయన్స్ సేవలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జిల్లాలోని బడుగు బలహీన వర్గాల అభ్యుదయం కోసమే లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఏర్పాటైందని నూతన కార్యవర్గం ప్రకటించిం ది. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం స్థానిక మానస ఇన్ హెూటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి. ఖాసింఖాన్ మాట్లాడుతూ ప్రజల్లో సేవాభా వాన్ని పెంచేందుకే క్లబ్బు ఏర్పాటైందన్నారు. సంస్థ నిర్వహణకు తన వంతు సహాయ సహకారాలు భవిష్యత్తులో కూడా అందజేయగలమని చెప్పారు. లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె. చిన్నప రెడ్డి ప్రధాన ప్రసంగం చేస్తూ ప్రజలకు ప్రభు త్వం ఎంతో సహాయం చేస్తోందని, తమ వంతుగా మానవత్వాన్ని చాటుకొంటూ క్లబ్బు కొత్త కమిటి మరిన్ని సేవలు అందించనున్న దని వివరించారు. లయన్స్ పాస్ట్ గవర్నర్లు సిహెచ్. రమేష్‌నాథ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం, ప్రతిజ్ఞ చేయించగా, లయన్ డా. ఎం. సుధాకర రెడ్డి నూతన సభ్యులను సభకు పరిచయం చేశారు. లయన్స్ ప్రముఖులు కె. కృష్ణమూర్తి, షేక్ అబ్దుల్లా, జి. గుల్జార్ బాషా, పి.ఎస్. హరినాథ రెడ్డి, పి.వి. రమేష్‌లతో పాటు అన్ని క్లబ్బుల అధ్యక్షులు ప్రత్యేక అతిథులుగా హాజరై ప్రసంగించారు. అధ్యక్షులు డా. ఆర్. రంగనాథ రెడ్డి, కార్యదర్శి వి. గౌరీ శంకర్, లయన్ గునిశెట్టి శ్రీనివాసుల పర్యవేక్షణలో నూతన కమిటీ అధ్యక్షునిగా పోతుల వెంకట్రామి రెడ్డి, ఉపాధ్యక్షులుగా వలికల గౌరీ శంకర్, కారపురెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి, కార్యదర్శిగా కొండూరు జనార్దన రాజు, సహ కార్యదర్శిగా బోగాల కొండా రెడ్డి, కోశాధికారిగా దేవతి రవీంద్ర నాథ్, సహ కోశాధికారిగా ముకేష్ కుమార్లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం వివిధ విభాగాల చైర్మన్లుగా తొమ్మిది మంది వైద్యులను, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను, 16 మందిని బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పోతుల వెంకట్రామి రెడ్డి మూడు నెలల సేవా కార్యక్రమాలను ప్రకటించారు. ఇతర కార్యవర్గ సభ్యులు, పూర్వ అధ్యక్ష కార్యదర్శులు అతిథులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

పీఆర్‌టీయు మండల అధ్యక్షుడిగా నాగరాజు నాయక్

విశాలాంధ్ర-సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండల పిఆర్టియు మండల అధ్యక్షుడి గా నాగ రాజు నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పీఆర్‌టీయు క్రమశిక్షణ కమిటీ సభ్యులు శ్రీనివాసరాజు తెలిపారు. ఆదివారం రాయచోటిలో పిఆర్టి యు నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని పేర్కొన్నారు. పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎంపికకు పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సుండుపల్లి మండల అధ్యక్షుడిగా ఎంపికైన నాగరాజు నాయక్, సెక్రెటరీగా ఎంపికైన రమణ, వైస్ ప్రెసిడెంట్ గా ఎంపికైన వెంకట రమణలు మాట్లాడుతూ పిఆర్‌టి యు బలోపేతానికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మణిపూర్ ఘటన నేరస్తులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఆదివా రం ఖురేషి సంక్షేమ (కటిక) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.ఆరిపుల్లా మంగళ గిరి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మణిపూర్ ఘటన నేరస్తులను కఠినంగా శిక్షించా లని డిమాండ్ చేశారు. మణిపూర్లో మూడు నెలలుగా దాచిపెట్టిన హింస ఒక్కసారిగా బట్టబయలయిందని, మే 3వతారీఖున అక్కడ అల్లర్లను మొదలు పెడితే.. దానిని మూడు నెలలపాటు ప్రపంచానికి తెలియకుండా దాచటంలో బీజేపీ నాయకత్వం చాలా సఫలీకృతం అయ్యింది అని ఇన్ని దారుణాలు జరుగుతున్నా వాటిని బయటకు తెలియకుండా ప్రభుత్వం చేసిన పనేమిటీ అంటే అక్కడ ఇంటర్నెట్ లేకుండా చేయడం. అంతేకాదు ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి వెళ్ళిన వాళ్ళమీద కేసులు పెట్టి వాళ్ళను జైలు పాలు చేయడం పరిపాటి అయిందన్నారు. బయటకు రాకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాచి పెట్టింది. రాష్ట్రంలో మహిళలకే భద్రత లేకుండా పోవడం దేశంలోని బీజేపీ వారంతా సిగ్గుపడాలని నిత్యం భారత్ మాతాను తలుచుకోవడం భరతమాత ఒడిలో ఉన్నటువంటి ఆడవాళ్లను ఇలా హేయంగా చేయడం ఎంతవరకు సబబు అని నిత్యం నరేంద్ర మోడీ బేటి బచావో బేటి పట్టావో అనే నినాదాలు ఇవ్వడమే గాని దేశంలోనే ఆడవారికే భద్రత లేకుంటే దేశాన్ని వీళ్ళు ఏ మాత్రం రక్షిస్తారో అర్థం అవుతుందన్నారు. మణిపూర్ లో రెండు నెలలకుపైగా విద్వేషపూరిత మంటలు చెలరేగుతున్నా, వందల మంది మరణిం చినా, చర్చీలు, దేవాలయాలు, విధ్వంసానికి గురైనా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మౌనంగా ఎందుకు ఉన్నారని ఆయన ప్రశ్నించారు. మణిపూర్ మారణకాండను, భరతమాతలపై జరిగిన పైశాచిక అత్యాచార దాడులను తీవ్రంగా ఖండిద్దాం. ఉన్మాద రాజకీయాలను, వాటి సైద్ధాంతిక భావజాలాన్ని తిప్పికొడదాం వారు ప్రజానీకానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, అనంతపురం జిల్లా అధ్యక్షుడు మగ్దుమ్,మంగళగిరి నగర అధ్యక్షుడు హైదర్ అలీ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్రమ్, సిరాజ్,మహ్మద్ హుసేన్,అబ్దుల్ లతీఫ్, షేక్ సాబ్, తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత విద్యార్థి బ్లాక్ మండల అధ్యక్షుడిగా సైఫ్ అలీ ఖాన్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అఖిల భారత విద్యార్థి బ్లాక్ చిన్న మండెం అధ్యక్షుడుగా సైఫ్ అలీ ఖాన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేషా తెలిపారు. స్థానిక చిన్నమండెం మండలంలోని ఏఐఎస్బి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని నూతనంగా ఎన్నికైన మండల కమిటీకి ఆయన పిలుపునిచ్చారు. నూతనంగా మండల అధ్యక్షులుగా ఎన్నికైన సైఫ్ అలీ మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ కాలేషాకు రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత విద్యారంగంలో జరుగుతున్నటువంటి ఫీజుల దోపిడీ పైన, విద్యా వ్యాపారం పైన, వసతి గృహ సమస్యల పట్ల, అన్ని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తామని అఖిలభారత విద్యార్థి బ్లాక్ బలోపేతానికి కృషి చేస్తానని సైఫ్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్బి మండల నాయకులు సమీర్ ఖాన్, సాబీర్ అలీ పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా



మైదుకూరు నుండి ప్రొద్దుటూరుకు భారీగా బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు పొద్దుటూరు రోడ్ లోని శ్రీ లక్ష్మి నరసింహ మోడరన్ రైస్ మిల్ నుంచి బిజెపి జనసేన కార్యకర్తలతో పొద్దుటూరుకు 200 బైక్లతో ర్యాలీ చేపట్టిన భారతీయ జనతా పార్టీ మైదుకూరు నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు భారత్ మాతాకీ జై అంటూ నరేంద్ర మోడీ, పురందేశ్వరి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ర్యాలీని ప్రారంభించడం జరిగింది.రాయలసీమ జోనల్ సమావేశనికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలకడం జరిగింది. అనంతరం భారతీయ జనతా పార్ట ఎంపీ సీఎం రమేష్ కి శాలువాతో సన్మానం చేయడం మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డిని, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి, నాగోతు రమేష్ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి లను కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైదుకూరు బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

రాజన్న భోజనం ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నా

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఆకలి విలువ తెలిసిన వాడిని కాబట్టే రాచమల్లు వారి రాజన్న భోజనం ఏర్పాటుచేసి పేదల ఆకలి తీరుస్తున్నానని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడు తూ రాచమల్లు వారి రాజన్న భోజనం ఏర్పాటు చేయడం పూర్తిగా నా వ్యక్తిగతం, ఇందులో ఎలాంటి స్వార్ధం లేదని, రాజకీయం కోసం కాదన్నారు. కేవలం పేదల కడుపు నింపాలన్నదే నా ఆశయం, అభిమతం అన్నారు. టీడీపీ నాయకులు సురేష్‌నాయు డు సైతం పేదల కడుపు నింపేందుకు అన్నా క్యాంటిన్ ఏర్పాటుచేయడం ఎందో హర్షనీయం అన్నారు. నేను రాజన్న భోజనం ఏర్పాటు చేసిన సురేష్‌నాయుడు అన్నా క్యాంటిన్ ఏర్పాటుచేసిన ఇరువురం పేదల కడుపు నింపేందుకే అన్నారు. మీ కుటుంబసభ్యులలో ఒక్కరిగా ప్రతి పేదవానికి ఆహ్వానిస్తున్నానని, ప్రతి ఒక్కరు వచ్చి భోజనం చేయాలన్నారు. పాత బస్టాండు ప్రాంతంలో పండ్లు, పూలు, కూరగాయలు, ఫ్యాక్టరీలు, బట్టలషాపు ల్లో పనిచేసేవారు, ఆటో నడుపుకునే వారు అలాగే ఇతర ఊర్ల నుండి కొనుగోలు చేసేందుకు ప్రొద్దుటూరుకు వచ్చేవారు సైతం రాచమల్లు వారి రాజన్న భోజనాన్ని తినాలని పిలుపునిచ్చారు. ఉచిత భోజనం అని చిన్న తనంగా భావించకుండా ప్రతి ఒక్కరు భోజనం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పోలీస్‌కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగశేశారెడ్డి, వరికూటి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-కొండాపురం: మణిపూర్‌లో చెలరేగిన హింసాత్మక ఘటనలలో ఒక వర్గానికి చెందిన మహిళలను వివస్త్రలను చేసి ఊరేగింపులు చేయడం, అత్యాచారాలు అనంతరం హత్యలు చేయడం వంటి అమానుష ఘటనలు జరుగుతున్న ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని, వారికి న్యాయం చేయాలని నిరసిస్తూ కొండాపురంలోని బైపాస్‌రోడ్డు నందు అభ్యుదయ మానవహక్కుల సంఘం అధ్యక్షురాలు రామాంజనమ్మ, సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఎన్‌టీఎ మండల అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ బాధితులకు వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండి దోశులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు.

అంధకారంలో హరిజనవాడ

20రోజులుగా సరఫరా కాని విద్యుత్- భయాందోళనలో నివాసితులు- పట్టించుకోని విద్యుత్ శాఖ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామ హరిజనవాడలో 20రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కాలనీ అంధకారంలో ఉంది. ఇక్కడ సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రస్తుతం తేలికపాటి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్‌కాంతులు లేక వారు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా క్రిమికీటకాదులు, విషపురుగులు కాలనీలో సంచరించడం ప్రారంభమైందని తాము ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రాణాలను అరచేతిలో పట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడపాల్సివస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఇరవై రోజుల క్రితం చెట్ల కొమ్మలు పడి రెండు విద్యుత్ స్థంభాలు నేలకొరగడంతో సరఫరా నిలిచిపోయింది. యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపి చేతులు దులుపుకున్నారే తప్ప ఇక్కడి నివాసితుల అసౌకర్యంపై స్పందించకపోవడం పట్ల గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళితుల కాలనీ పట్ల ప్రభుత్వ శాఖలు సైతం వివక్ష చూపడం స్పష్టంగా కనిపిస్తోందని పలువురు అభ్యుదయవాదులు అభిప్రాయపడుతున్నారు. తరచూ మండల సమావేశాల్లో విద్యుత్‌శాఖపై విమర్శల వర్షం కురుస్తున్నా దున్నపోతుపై వర్షం పడినట్లే అన్న చందంలా ఆ శాఖ యంత్రాంగం వ్యవహరించడం కొసమెరుపు. కాగా ఇక్కడి ప్రజలు సీజనల్ వ్యాధులకు సులభంగా గురయ్యే ప్రమాదం నెలకొంది. ముఖ్యంగా దోమల తీవ్రత రాత్రి సమయాల్లో అధికంగా కనిపిస్తోంది. వాడ పరిస రాల్లో రాత్రిళ్లు సైతం బయట నిద్రించేందుకు,

సంచరించేందుకు సైతం అక్కడి వారు జంకుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆ సమయంలో విష సర్పాలు అధికంగా సంచరిస్తున్నాయని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

విశాలాంధ్ర-కొండాపురం: కడప-తాడిపత్రి ప్రధాన రహదారి పై వెంకటాపురం సమీపంలో సాయిబాబ గుడి దగ్గర లారీ, ఆర్‌టీసీ బస్సు ఢీ కొట్టిన సంఘటనలో లారీ డ్రైవర్ ప్రాణాలు కోల్పోయాడు. లారీకి ముందు టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీ కొనడంతో ప్రమాదం సంభవించింది. బస్సులోని నలుగురికి స్వల్ప గాయాలు కావడంతో బాధితులను ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ మోహన్ తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధిలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి నివాస గృహం నందు రోడ్లు లేకపోవడంతో గత 30సంవత్సరాల నుండి రోడ్డు లేకపోవడం రోడ్డు అంతా గుంతలుగా ఉండటంతో మురికినీరు అంతా రోడ్లపై ఉండటం వర్షపునీరు కూడ రోడ్లపై ఉండటంతో స్వామి గ్రామోత్సవానికి కూడ ఇబ్బంది పడుతుండటంతో ఎంపీపీ వీరనారాయణ రెడ్డి, జడ్పీటీసీ చొరవతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆదేశాలతో నిధులు కేటాయించి పనులను ప్రారంభించారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో రోడ్డు విస్తీరణలో భాగంగా అడ్డం ఉన్న బంకులను తొలగించడం జరిగింది. 25వ తేదిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతులమీదుగా భూమిపూజ కార్యక్రమం చేపట్టి సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. సుమారు రూ.25లక్షలతో పనులను ప్రారంభమవుతాయి.

క్షతగాత్రులను పరామర్శించిన మేడా విజయశేఖర్‌రెడ్డి

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : నిన్న జరిగిన బస్సు, లారీ ఆక్సిడెంట్‌లో మృతి చెందిన కుటుంబాలకు రాజంపేట యువ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి (మేడా పెద్దబాబు) ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే తిరుపతిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారి బాగోగులు తెలుసుకున్నా రు. నందలూరు మండలం ఎర్రచెరువుపల్లె గ్రామానికి చెందిన చింతకుంటలో నివాసం ఉంటున్న పప్పు రామచంద్రారెడ్డి వారి పిల్లలు గత బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాద ఘటన లో వారు బాధితులు. ఈ ప్రమాదంలో తిరుపతిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మేడా విజయ శేఖర్‌రెడ్డి (పెద్దబాబు) ఆసుపత్రికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి వారిలో మనోధైర్యం కల్పించి మీకు నేనున్నానని ఎంతటి సాయమైనా చేస్తామంటూ భరోసా కల్పించారు. కడప, రాజం పేట, తిరుపతిలో చికిత్స పొందుతున్న వారి కుటుంబాలకు కూడా ఆసరాగా ఉంటానన్నారు. ఈ యాక్సిడెంట్ తనకు ఎంతో బాధాకరంగా ఉందని మేడ విజయశేఖర్ రెడ్డి అన్నారు.

కార్మికులందరూ ఐకమత్యంగా ఉండాలి

విశాలాంధ్ర-వేంపల్లె: ద్విచక్ర వాహన మెకానిక్ కార్మికులందరు ఐకమత్యంగా ఉండాలని మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబహాని అన్నారు. స్థానిక షాదీఖానాలో ఆదివారం మెకానిక్ వెల్ఫేర్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్బంగా వారందరూ ర్యాలీ నిర్వహించారు. సుబహానితో పాటు ఉపాధ్యక్షుడు ఉల్లి సాంబశివరావు, మండల అధ్యక్షుడు దర్బార్, ఉపాధ్య క్షుడు సయ్యద్, జిల్లా అధ్యక్షుడు బహదూర్‌ఖాన్‌లను టీడీపీ మైనార్టీ నేత నిమ్మకా యల దర్బార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సుబహాని మాట్లాడుతూ సమష్టి కృషితో సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. టూవీలర్ మెకానిక్‌లను ప్రభుత్వం గుర్తించాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను మంజూరు చేయాలని కోరారు. 60ఏళ్లు పైబడిన వారందరికీ ప్రభుత్వ నుంచి వచ్చే సాయం అందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. నూతన కార్యవర్గంలో మండల ఉపాధ్యక్షుడిగా సయ్యద్, జిల్లా కమిటీ సభ్యుడిగా గఫార్, సెక్రటరీగా ఖాజా, గ్రీన్ ఇండియా అధ్యక్షుడు బాబా ఫకురుద్దీన్, ట్రెజరర్‌గా రఫీ, గౌరవాధ్యక్షు డుగా నాయబ్‌రసూల్‌లు ఎన్నికయ్యారు.

జగన్ పాలనలో నిరుపేదల శాతం తగ్గింది

విశాలాంధ్ర-పులివెందుల: ముఖ్యమంత్రి జగన్ పాలనలో నిరుపేదల శాతం సగభాగం తగ్గిందని డిస్ట్రిక్ విజిలెన్సు మానిటరింగ్ కమిటీ మెంబరు పైడిపల్లి కిశోర్ వెల్లడించారు. స్థానిక ఎస్పీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో గత ప్రభుత్వం కన్నా వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదరికం సగం వరకు తగ్గిందని స్వయానా నీతి ఆయోగ్ తన నివేదికలో వెల్లడించిందన్నారు. 2016 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 11.77 శాతం నిరుపేదలు ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత 2021 డిసెంబర్ నాటికి పేదరికం 6.06 శాతానికి తగ్గించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రజల జీవన ప్రమాణం గణనీయంగా పెరిగిందని వాటికి ముఖ్య కారణం జగనన్న తీసుకువచ్చిన నవరత్నాల పథకం ఎంతో దోహదపడిందన్నారు. ప్రజా సంక్షేమం పేదరిక నిర్మూలన కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి సీఎంగా చూడాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందని తెలిపారు.

25న జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: జూలై 25న విద్యారంగ సమస్యల పరిష్కారంకై జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని ఎస్సీ కళాశాల వసతిగృహం నందు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, ఏఐఎస్‌బి రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబులు కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 4033 సాంఘీక సంక్షేమ వసతి గృహాలలో 600355 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. వసతి గృహాలకు మెనూ ఏమో బారెడు ప్రకటించిన డబ్బులు చిటికెడు ఖైదీల కంటే దారుణంగా విద్యార్థులకు కేటాయించడం చూస్తే ఆర్భాటలు ప్రభుత్వముగా చలామని అవుతున్నదని అన్నారు. వసతి గృహాలను నాడు-నేడు కింద ఎందుకు చేర్చడం లేదని అన్నారు. జ్యోతిరావు పూలె, మోడల్ పాఠశాల అంబేద్కర్, కస్తూర్బా సమస్యలు అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని, అందువల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పాఠశాల విద్యా, ఇంటర్, డిగ్రీ, ఉన్నత విద్యారంగం ఉరితాయి బిగించింది అని విద్యారంగ సమస్యలు పరిష్కారంకై విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పార్థసారధి, ఈశ్వర్‌నాయక్, భానుప్రకాష్, తిరుమల్లయ్య, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పథకాన్ని విస్మరించడం దుర్మార్గం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఉచిత విద్యుత్ పథకాన్ని ముఖ్యమంత్రి జగన్ విస్మరించడం దుర్మార్గమని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ రాష్ట్ర జగన్ ప్రభుత్వం రైతు దుష్మన్, వ్యతిరేక ప్రభుత్వంగా పనిచేయడం దురదృష్టకరమన్నారు. ఈ క్రమంలో ఆంధ్ర ప్రదేశ్‌లోని జగన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ మోటర్లకు పంపుసెట్లకు మీటర్లుబిగిం చడం ప్రారంభించిం దన్నారు. త్వరలో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వ్యవసాయ మోటార్లు పంపుసెట్లు మీటర్లు బిగించడం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వైసీపీ ప్రభుత్వం కసరత్తును ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో దాదాపు18.50 లక్షల మీటర్లు ఉన్నాయని, ఈ నేపథ్యంలో రాయలసీమ జిల్లాల్లోని దాదాపు 12. లక్షల వ్యవసాయ మోటర్లు పంపు సెట్లు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ మీటర్లు ఏర్పాటు చేయడమంటే రైతుల మెడలకు ఉరితాళ్లు బిగించడమే అని ఇది ఉచిత విద్యుత్తు పథకం ఎత్తివేసే విధానమని జగన్ ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే వ్యవసాయ పంపుసెట్లకు జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మీటర్లు తొలగిస్తుందని తులసిరెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కాంగ్రెస్ అధికారం లోకి వస్తే "ఆరు" లక్షల రూపాయలు వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తుంది.అన్నారు. ఐదు వందల రూపాయలకే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తుందని తులసి రెడ్డి స్పష్టంచేశారు.

బస్‌షెల్టర్ ఏర్పాట్లపై అధికారులు చొరవ

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధిలోని బస్‌షెల్టర్ లేకపోవడంతో బస్సులు ప్రయాణికులకు బస్‌షెల్టర్ ఏర్పాట్లకోసం ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా చొరవ చూపించి 5రోడ్ల కూడలి సమీపంలోని ఏర్పాట్లకు సిద్ధం చేయడంతో అక్కడ వ్యాపారం నిమిత్తం బంకులు, తోపుడుబండ్లు ఏర్పాటుచేయడంతో వాటిని తొలగించాలని డిప్యూటీ తహసీల్దార్ జాన్సన్, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్ రావు నోటీసులు ఏర్పాటుచేయడంతో గ్రామస్థులు, కొట్ల యాజమాన్యాలు అబ్జక్షన్ చేశారు. దొర గారు మాకు న్యాయం చేయండి: కొన్ని ఏళ్ల తరబడి అక్కడనే నివాసం ఉంటూ చిన్న చిన్న కొట్లు ఏర్పాటుచేసుకుంటూ జీవన ఉపాధి కోసం చిన్న వ్యాపారాలు చేసుకుంటు ఉండేవారం అని ఇప్పుడు బస్‌షెల్టర్ ఏర్పాటుకోసం ప్రజాప్రతినిధులు, అధికారులు తొలగించాలని ప్రయత్నాలు చేస్తున్నారని మాకు న్యాయం చేయాలని 6కుటుంబాలు జీవన ఉపాధి కోల్పోతామని మాకు ఉపాధిని చూపించాలని వారు కోరారు. దూదేకులు, మైనార్టీల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

క్షతగాత్రులను పరామర్శించిన అతికారి దినేష్

విశాలాంధ్ర-సిద్దవటం : నిన్న జరిగిన లారీ, బస్సు రోడ్డు ప్రమాదంలో గాయ పడిన బాధి తులను రాజంపేట జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్ పరామర్శించి పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, పౌష్టికాహారం, కిట్లను అందజేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన రాజంపేట నియోజకవర్గ జనసైనికుడు ఏనుగుల మల్లి తండ్రి గారైన ఏనుగుల శంకరయ్య తీవ్రంగా గాయపడడంతో అతని కుటుంబ సభ్యులకు 10,000/- రూపాయల ఆర్థిక సహాయం చేశారు. అలాగే సిద్దవటం మండలానికి చెందిన బస్సు కండక్టర్ బాల వెంకటేష్ కూడా తీవ్రంగా గాయపడి ఐసియులో ఉన్నా అతని కుటుంబ సభ్యులకి కూడా 10,000/- రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా అతికారి దినేష్ మాట్లాడుతూ తరచూ ఇలాంటి రోడ్డు ప్రమాదాలలో అనేకమంది ప్రాణాలు కోల్పోవడం మరియు గాయపడడం చాలా బాధాకరమైన విషయమని ఆర్టీవో అధికారులు ఈ వేగంపై నియంత్రణ చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని అదేవిధంగా ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సహాయం తక్షణమే అందించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సింగనమల శ్రీనివాసులు, హేమంత్, అంద్రు, పాల్గొన్నారు.

మోడీ, షా రాజీనామా చేయాలి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : మణిపూర్ రాష్ట్రంలో మహిళల నగ్న ప్రదర్శన, సామూహిక అత్యాచారాలు, హత్యలు, దహనకాండతో భారతదేశ ప్రతిష్టను ప్రపంచం దృష్టిలో దిగజార్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా తమ పదవులకు తక్షణం రాజీనామా యాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్లు ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపుగా 80 రోజుల నుండి మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసకాండ,గృహ దహనాలు, చర్చిలు, దేవాలయాలు ,మసీదుల పై దాడులు మారనాధాయులతో అ ల్లరిమూకలు స్వైర విహారం చేస్తూ, మహిళలు పిల్లలు, యువకులు ను లక్ష్యంగా చేసుకొని హత్యలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మణిపూర్లో కుకీ తెగా అంతానికి, క్రైస్తవుల విధ్వంసానికి పక్క ప్రణాళికను అమలు చేస్తుందని ఆరోపించారు. మణిపూర్ రాష్ట్రం లేకుండా చేసే దురుద్దేశం స్పష్టంగా కనబడు తోందన్నారు. ప్రపంచం యావత్తు మణిపూర్‌లో చేస్తున్న అమాన వియ అమానుష ఘటనలకు శోకతప్త హృదయంతో బాధపడుతుండగా, భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వంలో మహిళా మంత్రులు ఉన్నప్పటికీ వారు కూడా స్పందించకపోవడంతో ప్రజల దృష్టిలో బిజెపి ప్రభుత్వం, నరేంద్ర మోడీ అమిత్‌షాపై విమర్శలు, ఆరోపణలు వరదల వెల్లువెత్తుతున్నాయన్నారు. గుజరాత్ రాష్ట్రంలో 2002లో ముస్లిం మైనార్టీలను ఊచకోత కోసిన అత్యంత అమానుష ఉదంతాలు, బిల్కీస్ బానోలాంటి అత్యాచారాలు, దహన కాండలు చేసిన అప్పటి ముఖ్యమంత్రి ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీకి మణిపూర్ రాష్ట్రం అమానుష ఘటనలు సర్వసాధారణమని ధ్వజమెత్తారు. 2024 ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వం ఉనికి కోల్పోతుందని హెచ్చరించారు.

పీస్ కమిటీతో సమావేశం నిర్వహించిన ఎస్ఐ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండలంలోని వివిధ గ్రామాలలో మొహర్రం పండుగ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని పోరుమామిళ్ల వి.మల్లికార్జున రెడ్డి తెలిపారు. శనివారం పోరుమామిళ్ల స్టేషన్‌లో మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మొహర్రం పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వహించుకోవాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో కుల మతాలకు అతీతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.మల్లికార్జున రెడ్డి, ఏఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాణిపూర్‌లో హింసాత్మాక ఘటనలు ఆపాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మొయితీ, కూకిల మధ్య మధ్య మాణిపూర్‌లో జరుగు తున్న అవమానియా ఘటనపై రక్షణ మరియు సిజెపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ప్లేకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్బంగా రక్షణ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు పల్లెకొండు సంపత్ మరి యు సిజెపి అధ్యక్షులు చైతల్యులు మాట్లాడుతూ యావత్ భారత దేశం తలదించుకునే విధంగా మాణిపూర్‌లో అల్లరి మూకలు ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి ఊరిగించి అత్యాచారం చేయడం చాలా బాధాకరం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చర్యకు సిగ్గు పడాలి. యావత్ భారత దేశం ఈ ఘటనలు ఖండించాలి. ఎప్పుడు ఇలాంటి సంఘటన పురరావృతం కాకుండా అల్లరి మూకలను శిక్షంచాలి.పట్టపగలే మహిళలకు రక్షణ లేని దేశంగా భారత దేశం చరిత్ర పుట్టాలలో నిలిచి పోతుంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మతచాదస్సు వాదుల ఆట కట్టించి చర్యలు తీసుకుని మాణిపూర్ ను రక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ మాల మహాసేన ఉపాధ్యక్షురాలు కొమ్మాలపాటి లావణ్య, దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షులు బండెల ఓబయ్య, శ్యాంసన్, శ్రీదేవి, మహిళలు పాల్గొన్నారు.

బి.ఎస్.రావుకు పలువురు ఘన నివాళులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బి.ఎస్.రావు సంస్కరణ సభలో పలువురు రాజకీయ నేతలు విద్యాసంస్థల అధినేతలు అధ్యాపకులు విద్యార్థి సంఘ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం నగర శివారులోని మాధవి కన్వెన్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన సంస్కరణ సభకు ఉపముఖ్యమంత్రి అంజాద్‌భాష, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, కడప నగరం మేయర్ సురేష్ బాబులతో పాటు పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజద్‌భాష మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో ఉంటూ ఎంతోమంది విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు శ్రీ చైతన్య విద్యా సంస్థలు స్థాపించి ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపిన మహా వ్యక్తి డాక్టర్ బి.ఎస్.రావు అని కొనియాడారు. విద్యాసంస్థలతో నాకు అంతో ఇంతో సంబంధం ఉందని ఇప్పుడు పేద విద్యార్థుల తల్లిదండ్రులు నా దగ్గరకు వచ్చిన ఫోన్ చేసిన వెంటనే వారికి ఫీజులో రాయితీ ఇచ్చి చదువుకొనేందుకు అవకాశం కల్పించిన శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణ స్పందించి విద్యా అవకాశం కల్పించాన్నారని గుర్తు చేశారు. అలాగే డాక్టర్ బివి రావు శ్రీ చైతన్య విద్యాసంస్థలు పెట్టి ఎందరికో జీవనోపాధి కల్పించిన మహా వ్యక్తి అనే అన్నారు. అనంతరం శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణ మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థలను స్థాపించి దేశవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులను డాక్టర్లను ఇంజనీర్లను ఐఏఎస్ ఐపీఎస్లుగా అందించిన ఘనత డాక్టర్ బి.ఎస్ రావు కె దక్కుతుందన్నారు. దేశవ్యాప్తంగా 321 జూనియర్ కళాశాలలు, 322 శ్రీ చైతన్య ఈ టెక్నో స్కూల్, 107 శ్రీ చైతన్య సీబీఎస్ ఈ స్కూల్స్ స్థాపించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి రాయచోటి సుగువాసి ప్రసాద్ బాబు విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని ఘన నివాళులర్పించారు.

పత్తికి ఎరనక్క తెగులు - రైతన్నకు దిగాలు

విశాలాంధ్ర-పులివెందుల: ఈ ఏడాది పత్తిపంటపై రైతుల ఆశలు ఆవిరయ్యాయి. వ్యయప్రయాసాలకోర్చి సాగు చేసిన పత్తి పంటకు ఎరనక్క తెగులు సోకవడంతో సాగు రైతు దిగాలును వ్యక్తంచేస్తున్నాడు. కాసిన్ని పదును వానలు రావడంతో ఈ దఫా కూడా రైతులు సాగు చేసిన పత్తిపంట విస్తీర్ణం కూడా పెరిగింది. వేరుశనగసాగుపై మక్కువ చూపని రైతులందరూ పత్తిపంట వేశారు. పైరు మధ్యస్థితి వరకు కళకళలాడింది. పత్తిపంట వల్ల తమ జీవితాలు గట్టెక్కుతాయనుకున్న సమయంలో ఎరనక్క తెగులు సోకింది. దిగుబడి చేతికందే దశలో పత్తి రైతు నిరాశకు గురవుతున్నాడు. ఖాళీగా ఎన్నో ఆశలు నింపుకొని రైతులు పత్తిపంట సాగు చేశారు. పంట కోసం వేలాది రూపాయలు వెచ్చించారు. కృష్ణా జలాలు అందుబాటులో ఉన్న కారణంగా సాగునీటి సమస్య తలెత్తలేదు. పైరు మధ్యలో అప్పుడప్పుడు కురిసిన వర్షాలు రైతుకు కాస్త ఊరట కలిగించాయి. సాగు కోసం సుమారు ఎకరాకు 20 నుంచి రూ.40వేల దాకా ద రైతులు ఖర్చు చేశారు. అనుకోకుండా వచ్చిన వర్షాలు పైరు ఏపుగా పెరిగింది. పైరు కళకళలాడుతున్న దశలో తెగులు సోకడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ తెగులు వల్ల ఆకులు ఎర్రగా మారిపోవడం, పక్వానికి వచ్చిన గాయ పగిలిపోవడము జరుగుతోంది. దీంతో దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉన్నట్లు రైతులు తెలిపారు. తెగుళ్ల నివారణ కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టిన ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దిగుబడి వచ్చిన కాడికి విక్రయించుకుని సొమ్ము చేసుకోవాల్సిన పరిస్థితి రైతులకు ఎదురైంది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పత్తి రైతును ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఆదిశగా ప్రజా ప్రతినిధులు అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

విశాలాంధ్ర అన్నమయ్య జిల్లా



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.6 లక్షల రుణమాఫీ

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొస్తే రైతులకు రూ.6లక్షల రుణమాఫీ ఇస్తారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మెన్ ఎస్.తులసి రెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురం గ్రామ పంచాయతీలోని ఈడిగ పల్లెలో రాయచోటి నియోజకవర్గం ఇంచార్జ్ అల్లా బకస్ (సిఎల్‌పి) ఆధ్వర్యంలో 10 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ముఖ్య అతిథులుగా తులసి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వ్యతిరేకంగా ఉన్నారని రైతులకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయంపైన ఆసక్తి తగ్గుతుందని అప్పులలో కూరుకుపోయి ఆత్మ హత్యలు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ జాతీయస్థాయిలో రైతు ఆత్మహత్యలు మూడో స్థానంలో ఉందని ఆయన అన్నారు. కౌలు రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉందన్నారు. 2008లో కాంగ్రెస్ పార్టీ రైతు రుణమాఫీ చేసిన విషయం అందరికీ తెలుసని గుర్తు చేశారు. ఇకపోతే వంట గ్యాస్ విషయానికి వస్తే వైసీపీ ప్రభుత్వం రేట్లు అధికంగా పెంచేశారని గృహిణిలు వంట రూమ్‌లోకి పోవడానికి భయపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 500 రూపాయలకే గ్యాస్ అందిస్తుందని తెలియజేశారు. మణిపూర్‌లో జరుగుతున్న మరణకాండ మోడీ ప్రభుత్వానికి పార్టీ పట్టినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన కుటుంబాలు షేక్ అమీర్, షేక్ మహబూబ్ బాషా, షేక్ రమీజా, ఇనయ్ తుల్లా, హుస్సేన్ బాషా, వీరబల్లి మల్లయ్య, మస్తానయ్య, రాజశేఖర్, తుమ్మల సతీష్ కుమార్, వెంకటరమణ, ఎల్లప్ప, బుక్కే. రామతులసి వీరితో పాటు 10 కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో చిన్న రెడ్డయ్య, రఫీ, చెన్న క్రిష్ణ, ఖాదరవల్లి, అమర, ఉత్తన్న, మంజునాథ, ఖాదర్ ఖాన్, నరేష్, రమణమ్మ, లతా, మహబూబ్‌జాన్, ఉభయుతుల్లా పాల్గొన్నారు.

25న విద్యాసంస్థల బంద్

విశాలాంధ్ర- మదనపల్లి: వైసిపి ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జూలై 25న టిఎన్ఎస్ఎఫ్ చేపడుతున్న విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బోడెం భాను యాదవ్ కోరారు. అదేవిధంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపుపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. విద్యా దీవెన వసతి దీవెన బకాయిలు తక్షణమే విడుదల చేయాలి, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని పునరుద్ధించాలి, అదేవిధంగా అమ్మ ఒడి పథకం అందరి పిల్లలకు వర్తింప చేయాలని, జీవో నెంబర్ 77 రద్దుచేసి చదువుకునే ప్రతి విద్యార్థికి ఫీజు రియంబర్స్మెంట్ సౌకర్యాన్ని కల్పించాలి. అదేవిధంగా మెగా డీఎస్సీ ని ప్రకటించాలి, జూనియర్ లెక్చరర్స్ డిగ్రీ లెక్చరర్స్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలను తక్షణమే చేపట్టాలి అని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీరామాలమ్మ పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండల పరిధిలోని అద్దేపల్లి గ్రామం వెంగమరాజుపోడు కు చెందిన ముప్పాల హేమనవర్మ ధర్మపత్ని లలితమ్మ కుమారుడు తరుణ్ వర్మ అద్వర్యంలో అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న శ్రీరామాలమ్మ పుణ్యక్షేత్రంలో ఈ నెల జూలై 26 బుధవారం నుండి 28 శుక్రవారం వరకు మూడు రోజుల పాటు వేదపండితులచే భక్తి శ్రద్దలతో ప్రత్యేక శతరుద్ర హెూమం పురస్సర శత చండీ యాగం జరుగుతాయని శ్రీరామాలమ్మ పుణ్యక్షేత్రం నిర్వాహకులు ముప్పాల హేమనవర్మ పాత్రికేయులకు తెలిపారు. 27 న గురువారం అద్దేపల్లి గ్రామ ప్రజల అద్వర్యంలో, 28 న శుక్రవారం ముప్పాల హేమనవర్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పార్వతి, పరమేశ్వరుల కళ్యాణంఅత్యంత వైభవోపేతంగా జరుగుతుందన్నారు.

వివాహ రిసెప్షన్‌కి హాజరైన టిడిపి నేత చమర్తి జగన్ రాజు

విశాలాంధ్ర -రాజంపేట : రాజంపేట పట్టణంలోని, స్థానిక ఏబి చంద్రారెడ్డి గార్డెన్స్ నందు ఇటీవల వివాహమైన నూతన వధూవరులు జయ బాల కిషోర్, తేజశ్రీ తేజ దంపతుల రిసెప్షన్ కార్యక్రమానికి విచ్చేసి నూతన వధూవరులను ప్రముఖ విద్యావేత్త, రాజంపేట నియోజకవర్గ సీనియర్ నాయకులు చమర్తి జగన్ రాజు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కల్లుగీత కార్మిక రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, సీనియర్ నాయకులు బండారు బాలయ్య, యువ నాయకులు పరుశురామ్ నాయుడు, హరినాథ్ రెడ్డి, సూర్యనారాయణ రాజు, శేషారెడ్డి, మైనారిటీ నాయకులు కరీముల్లా,తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సుహేల్, గురు నాయుడు, సురేష్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన మేడా విజయ శేఖర్ రెడ్డి



విశాలాంధ్ర- నందలూరు : మండలం లోని ఎర్ర చెరువు పల్లి పంచాయితీ చింతలగుంటలో నివాసం ఉంటున్న పప్పు రామచంద్రారెడ్డి వారి పిల్లలు, శనివారం సాయంత్రం ఓబులవారిపల్లె డాబా దగ్గర జరిగిన ప్రమాదం లో గాయాలై, వారు తిరుపతి నారాయణ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాజంపేట యువ నాయకుడు మేడా విజయ శేఖర్ రెడ్డి (మేడా పెద్దబాబు) ఆ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించి, మీకు నేను ఉండాను ఎంతటి సహాయమైనా చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు ఎద్దుల విజయసాగర్, ఆయన వెంట మేడ పెద్దబాబు అభిమానులు పాల్గొన్నారు.

పాఠశాలలను పొగాకు రహితంగా మార్చండి

విశాలాంధ్ర- రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాల లన్నిటిని పొగాకు రహిత పాఠశాలలు (టొఫీ)గా మార్చాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పొగాకు దాని సంబంధిత ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని, మరణానికి దారి తీస్తున్నాయని కాబట్టి అన్నమయ్య జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు ఈ కార్యక్రమాన్ని అమలు పరచాలన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ మన జిల్లాలో ఈ కార్యక్రమ నిర్వహణ, పర్యవేక్షణ లను పరిశీలిస్తుందన్నారు. టొఫీ కార్యక్రమంలో తొమ్మిది కృత్యాలు ఉంటాయని వీటి నిర్వహణకు ఉపాధ్యాయులలో ఒకరిని లీడర్ గా నియమించాలని, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఈనెల 25, 26 తేదీలలో నిర్వహించనున్న ఆన్లైన్ శిక్షణలో ప్రధానోపాధ్యాయులు మరియు టొపీ లీడర్ తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఇతర సందేహాలకు టొపీ జిల్లా నోడల్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డిని సంప్రదించాలన్నారు.

చెలరేగుతున్న ఇసుక మాఫియా

పలుకుబడి ఉన్నోడికి రాత్రుళ్లలో కోరుకున్నంత ఇసుక- పేదోడికి, జగనన్న ఇళ్లకు సైతం తప్పని కష్టాలు

విశాలాంధ్ర - సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండల కేంద్రంలో ఓ ప్రైవేటు కన్‌స్ట్రక్షన్ పేరుతో ఇసుక మాఫియా రోజు రోజుకు మితి మీరిపోతుందనే చెప్పాలి. గతం లో ఎన్నాడు లేనివిధంగా అన్నమయ్య జిల్లా విజిలెన్స్ డిపార్మెంట్ అధికారులు ఓ ప్రైవేట్ కంపెనీ చేతికి అధికారం కట్టబెట్టిందని చెప్పుకుంటూ తిరుగుతూ బిల్లు బుక్‌ను కొట్టించుకొని ఇసుక దందాకు పాల్పడుతున్నారు. ఓ కన్‌స్ట్రక్షన్ పేరుతో వారికి నచ్చిన వారికి ఇసుకను రాత్రులల్లో పోలీస్‌ల సహకారంతో ట్రాక్టర్లతో తోలుకుంటారు. చిన్నా చితక పేదలకు జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఆంక్షలు విధిస్తున్నారు. గతంలో విజిలెన్స్ అధికారులకు మట్టి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది అని సమాచారం ఉన్నా పట్టించుకోని అధికారులు ఇప్పుడు ఓ ప్రవేట్ వ్యక్తులకోసం ఓ ప్రైవేటు పేరుతో ఇసుక దందాకు సహకరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ అధికారులు, విజిలెన్స్ అధికారుల నిద్ర మత్తును వీడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తాహసీల్దార్ వివరణ: ఈ విషయంగా తాహసీల్దార్‌ను వివరణ కోరగా గతంలో రాయ వరం కావలిపల్లి దగ్గర రీచ్ ఉండేది. ఆ రీచ్‌ను పునరుద్ధరణ చేసేందుకు కలెక్టర్ అనుమతితో ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించాము. అయితే నదీ పరీవాహక ప్రాంతాలలో గల రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రీచ్ ఓపెన్ చేయలేదు. అయితే ప్రైవేటు వ్యక్తులకు ఎవరికీ అనుమతులు కేటాయించలేదు. తదుపరి కలెక్టర్ ఆదేశాల మేరకు రీచ్ ప్రారంభిస్తాము.

గిరిజన మహాసభకు తరలిరండి

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె ఈనెల 29వ తేదీ అనగా శనివారం నాడు జరిగే ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం మాసాపేట మార్కెట్ యార్డు వద్ద భోజనాలు అనంతరం మాసాపేట మార్కెట్ యార్డ్ నుండి ర్యాలీతో ప్రారంభమై బంగ్లా సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ వరకు ర్యాలీ గుజ్జునిర్ కళాశాల గ్రౌండ్లో భారీ బహిరంగ సభ.. ఈ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలకు ఆయా జిల్లాల గిరిజనులు రకరకాల నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరుగును. వేలాదిగా గిరిజన బిడ్డలు తరలి వచ్చి మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సమైక్య రాష్ట్ర మహా సభల రాష్ట్ర ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ నాయక్ కోరారు.

మూడు లారీలు ఢీ- డ్రైవర్ తీవ్ర గాయాలు

విశాలాంధ్ర- రామాపురం : కర్నూలు చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్న గారి పల్లి సమీపంలో ఉన్న వంతెన వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు లారీలు ఢీకొని టీఎస్ 52 టీ 83 52 నెంబర్ గల లారీ డ్రైవర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప వైపు నుంచి సిమెంట్ లోడుతో వెళ్తున్న మూడు లారీలు మార్గమధ్యంలోకి రామాపురం మండలం పాలన్న గారి పల్లి సమీపంలోని వంతెన వద్దకు రాగానే ముందు వెళున్న లారీ స్లో కావడంతో వెనకవైపు వెళుతున్న టీఎస్52 టీ 83 52 నెంబర్ గల లారీ ఢీకొనడంతో లారీ డ్రైవర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. అలాగే ఏనుగు వైపు నుంచి మరో లారీ ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీలను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కొండారెడ్డి తెలిపారు.

భవననిర్మాణ కార్మికుల సంక్షేమానికై పోరాడండి: ఏఐయూటీసీ

విశాలాంధ్ర-మదనపల్లి: రాష్ట్రంలో దాదాపు 35 లక్షల కుటుంబాలు భవణ నిర్మాణ రంగం పై ఆధారపడి జీవిస్తున్నారని భవణ నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించి నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మొలకలచెరువు లో కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సమావేశం యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మబ్బాషా, రెడ్డి మౌళాళి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివ మాట్లాడుతూ రాష్ట్రంలో 35 లక్షల కుటుంబాలు నిర్మాణరంగంపై ఆధారపడి దీవిస్తున్నాయని, వీరి ఉపాధికి తీవ్రఆటంకం ఏర్పడిందని, నిర్మాణ సామాగ్రి స్టీలు, సిమెంటు, ఇసుక, కలప, పెయింట్ ధరలు ఆకాశాన్ని అంటడంతో బడా బిల్డర్లు సైతం నిర్మాణాలు చేయడానికి భయపడుతున్న పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో భవననిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కార్మికులందరూ పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంట్,ఇసుక,ఐరన్,కంకర,కలప,ధరలను అదుపు చేయాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతి భవణ నిర్మాణ కార్మికులకు 3000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ తంబళ్ళపల్లి నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలీం భాష, వేణు గోపాల్ రెడ్డి, ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షుడు అంజనప్ప, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు నారాయణ స్వామి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శంకర్ భాషా, శ్రీనివాసులు, లక్ష్మికర, మహబూబ్ బాషా, మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధిగా రవి మాదిగ నియామకం

విశాలాంధ్ర-మదనపల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి గా అన్నమయ్య జిల్లా మదనపల్లె కు చెందిన రవి మాదిగ ను నియమిస్తున్నాం గత రెండు సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ మదనపల్లె ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు గా పనిచేశారు. క్రమశిక్షణ కలిగిన ఉద్యమ కారుడిగా మాదిగ జాతి కోసం, సమాజం కోసం, ఉద్యమం లో నిరంతరం కష్టపడుతున్నాడు. గత కొంతకాలంగా మదనపల్లె టౌన్ ఎమ్మార్పీఎస్ ఉద్యమ నిర్మాణం లో కీలక బాధ్యతలు తీసుకుని సమర్ధవంతంగా పనిచేశారు. అందువల్ల ఉద్యమ స్ఫూర్తి ని,క్రమశిక్షణ ను పరిగణనలోకి తీసుకుని రవి మాదిగను ఎమ్మార్పీఎస్ అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి గా నియమిస్తున్నామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు: డిఎస్పీ

విశాలాంధ్ర -రామసముద్రం: అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ఆదేశాల మేరకు మదనపల్లి సబ్ డివిజనల్. సివిల్ .ఎస్ టి ఎఫ్ ఏర్పాటు చేసిఖచ్చితమైన సమాచారంతో సబ్ డివిజనల్ పరిధిలోని అసాంఘిక కార్యకలాపాలపై నిఘాఉంచి దాడులు చేస్తున్నామని మదనపల్లి డిఎస్పి కేశప్ప తెలిపారు. అందులో భాగంగా గడచిన శనివారం నమ్మకమైనటువంటి సమాచారం మేరకు రామసముద్రం మండలం యలవ నెల్లూరు పంచాయతీ దాసార్లపల్లి గ్రామం వద్ద కర్ణాటక సరిహద్దులో మల్లికార్జున రెడ్డి నాగరాజ ఆర్గనైజ్డ్ గాంబ్లింగ్ నిర్వహిస్తుండగా మదనపల్లి రూరల్ సీఐ శివాంజనేయులు.రామసముద్రం ఎస్ ఐ చంద్రశేఖర్.సబ్ డివిజనల్ స్పెషల్ పార్టీ బృందం సదరు ప్రాంతంలో దాడులు నిర్వహించి11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి47,150 నగదు.17 ద్విచక్ర వాహనాలు.12 మొబైల్ ఫోన్లు.ఐదు బంగారు ఉంగరాలు మూడు వెండి చైన్లు రెండు వెండి కడియాలు ఒక వెండి ఉంగరం మరియు ఒక వాచ్ స్వాధీనం చేసు కొన్నారు. గాంబ్లింగ్ యాక్ట్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి.కేసు దర్యాప్తు చేస్తున్నామని. ఈ బెట్టింగుల వల్ల చాలామంది అప్పులు చేయడం ఇళ్లలో ఉన్నటువంటి వస్తువులు మరియుటూ వీలర్స్ ను కూడా తాకట్టు పెట్టి.అప్పుల పాలై జీవితాలు నాశనం అవుతున్నాయని తెలిపారు.జూదరులు ఇకనైనా తమ పద్ధతి మార్చుకోకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని జూదరులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ సమావేశంలోమదనపల్లి తాలూకా సిఐ శివాంజనేయులు రామసముద్రం ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మృతిచెందిన వాలంటీర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర- బి.కొత్తకోట: పి.టీ.ఎం మండలం టీసధుం గ్రామం వాల్మీకి కులానికి చెందిన వాలంటీర్ తలారి జయచంద్ర గత నెల క్రితం కరెంట్ షాక్ తో మృతి చెందాడు మృతి చెందిన కుటుంబానికి ఆదివారం తంబళ్లపల్లి నియోజకవర్గం ఒక్కలిగా మరుసు కాపు సంఘం ఆధ్వర్యంలో 50 వేల రూపాయలు నగదును అందజేశారు అందజేసిన వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త డి .జయ చంద్ర రెడ్డి 10000 జంబగానిపల్లి రవి చంద్రారెడ్డి 10000 దేవరింటి రామకృష్ణారెడ్డి 10000 రవిశంకర్ రెడ్డి 10000 మొరుసు కాపు సంఘ సభ్యులు 10000 మొత్తం 50వేలు అందజేశారు ఈ సందర్భం గా పారిశ్రామికవేత్త జయచంద్ర రెడ్డి వారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి ఓదార్చి మీకు అండగా వుండి ఎలాంటి సమస్య వచ్చినా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొరుసుకాపు రెడ్లు (ఒక్కలిగర)నాటి నుండి నేటి వరకు సహాయక సహకారాలు అందిస్తూ పెద్దల ఆచారాన్ని సంఘం సభ్యులు పాటించి ఇతర కులాలలో కష్టాలను పాలు పంచుకొనే విధంగా ముందుకెళ్తామని తెలిపారు.ఆయన వెంట ఆంజనేయ రెడ్డి,మంత్రి గిరిధర్ రెడ్డి, ఎం.ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఏవి రఘునాథ్ రెడ్డి,నవీన్ రెడ్డి,రవి చంద్రారెడ్డి, కేశవరెడ్డి,మాజి సర్పంచ్ మస్తాన్ రెడ్డి,తరుగు శివారెడ్డి,కె నరసింహారెడ్డి, శెట్టిపల్లి లోకనాథ్ రెడ్డి, రాయలసీమరమేష్ రెడ్డి,శంకర్ రెడ్డి,గంగుల్ రెడ్డి,జి రెడ్డప్పరెడ్డి,బి సురేందర్ రెడ్డి,సి రెడ్డి శేఖర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి రెడ్డప్ప రెడ్డి,ఈశ్వర్ రెడ్డి,ఒడిగల ప్రతాపరెడ్డి,ఎస్ఎన్ రాజశేఖర్ రెడ్డి,మార్కిరి రెడ్డప్ప రెడ్డి పాల్గొన్నారు.

బస్సు ప్రమాద ఘటనపై చమర్తి దిగ్భ్రాంతి

విశాలాంధ్ర -రాజంపేట: అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబులవారిపల్లె మండల పరిధిలోని చిన్నవరంపాడు దగ్గర జరిగిన బస్సు ప్రమాద ఘటనపై ఆదివారం ప్రముఖ విద్యావేత్త, టిడిపి నియోజకవర్గ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మరణించిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, అదే ప్రమాదంలో గాయపడ్డ వారు అతి త్వరగా కోలుకోవాలన్నారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి గాయపడ్డ వ్యక్తులకు ఎక్సగ్రేషియా ప్రకటించినప్పటికీ వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. జాతీయ రహదారులపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర -రాజంపేట:పట్టణ కేంద్రంలోని నూనె వారి పల్లె రోడ్డు నందు ఆదివారం తోట రామయ్య క్లినిక్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి డాక్టర్ రెడ్డి ప్రసాద్ బాబు, డాక్టర్ సునీల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 300 మందికి ఉచితంగా బీపీ, షుగర్, పి ఎఫ్ టి, బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ తోటరామయ్య, తిరుపతికి చెందిన రేడియంట్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత నల్లారి కిషోర్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర-పీలేరు: పీలేరులో ఆదివారం ఇంటింటికి నల్లారి" కార్యక్రమనికి విచ్చేసిన టీడీపీ పీలేరు నియోజకవర్గ ఇంచార్జి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కీ కావలిపల్లె,యల్లమంద క్రాస్ లకు చెందిన స్థానికులు ఘనస్వాగతం పలికారు. నల్లారి కిషోర్ ఇంటింటికీ తిరుగుతు పేరు,పేరున ప్రతి ఒక్కరిని పలికరించారు. అనంతరం ఇంటింటికి నల్లారి" కార్యక్రమలో అట్టహాసంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి బాబురెడ్డి,మాజీ జడ్పీటీసీ సభ్యులు మల్లెల రెడ్డిబాష, మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర సాధికారకమిటీ కార్యదర్శి పురంరామ్మూర్తి, యల్లెలరెడ్డెప్పరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు అమరనాథరెడ్డి, దళవాయి సురేష్ కుమార్ రెడ్డి,(కంచిసూరి) ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, నియోజకవర్గ ప్రముఖనేత కొత్తపల్లి శ్రీనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, కలికిరి గిరీస్ మద్దెల, వాసునూరి చంద్రశేఖర్,శివశంకర్, షామియాన జయన్న, కృష్ణయ్య, తెలుగు యువత అధ్యక్షులు నల్లారిరియాజ్,లక్ష్మీప్రసాద్,(చిన్న)ఫైరోజ్, మైనార్టీ నాయకులు ఛాన్ బాషా, షౌకత్, వైన్స్ ఖాదర్, పురుషోత్తం రెడ్డి,హనీఫ్,కేజీన్ రెడ్డిబాషా,గాజుల రవి కుమార్, రైతుసంఘం నాయకులు అమరనాథ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి, బుజ్జు,స్పోర్ట్స్ మల్లి,నియోజకవర్గ బిసిఅధ్యక్షులు వసంతలరాజా, వరం పాటి రెడ్డెప్ప రెడ్డి,గాండ్ల విజయ్ కుమార్, మొహమ్మద్ పీర్,ఆర్టీసీ నల్లగుట్ట మస్తాన్, సీనియర్ నాయకులు జాఫర్,సుబ్బయ్య, ఖాజాపీర్, రెడ్డిముని, బాబురమేష్,రాజా మహేష్, అబ్దుల్లా, రహంతుల్లా,అప్పస్వామి,రమాదేవి, అనూరాధ,లక్ష్మీ కాంతమ్మ,షమ, ఎర్రగుంట్లపల్లి అమరనాదరెడ్డి,కప్పరం చంద్రయ్య,మిట్టమీద శివ,సోని బాషా,మహేష్ గంజి,మంజు, షఫీ,షరీఫ్,సురేష్, క్రాంతి, నాగరాజా, రవి నాయక్, వెంకట రమణానాయక్,అరటికాయల శేఖర,తదితరులు పాల్గొన్నారు.

కిషోరన్న.... బాగున్నారా....స్థానికుల ఆప్యాయత : కిషోరన్న... బాగున్నారా... అంటు కావలిపల్లి గ్రామస్తులు, చిన్నక్క.. ఇంటింటికి నల్లారి కార్యక్రమానికి వచ్చిన టీడీపీ నేత నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికీ స్థానికులు ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో ఉండే ప్రతి ఒక్కరిని పేరు,పేరున కిషోర్ పలకరించి టీడీపీ తొలి విడత మేనిఫెస్టో "భవిష్యత్తు గ్యారంటీ" సంక్షేమ పథకాల గురించి వివరించి తమప్రచారాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమంలో ,అనిఫ్ ,నాగరాజ ,జయచంద్రారెడ్డి ,బాబు , షరీఫ్ , పురుషోత్తంరెడ్డి ,రెడ్డిముని , స్పోర్ట్స్ మల్లీ , సందీప్ , విజయ్ , రాజు , శ్రీకాంత్,,ఖాదర్ లు పాల్గొన్నారు.

పదోన్నతులు పొందిన వారికి సన్మానం

విశాలాంధ్ర- నందలూరు: విద్యారంగంలో పదోన్నతులు పొందిన వారికి రాజంపేట రాజు విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నాగిరెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ టి యు మండల శాఖ అధ్యక్షులు పుత్త లీల కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ నాగయ్య, ఎస్ టి యు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పదోన్నతులు పొందిన ఎంఈఓ లు గంగిరెడ్డి, స్టాలిన్ ఐజాక్, గిరిజ కుమారి, ఉపాధ్యాయులు అల్లం అశోక్ కుమార్, జయలలిత కుమారి, రవిశంకర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, మోహన్ రాజు, చక్రపాణి, శేఖర్ బాబు, భరత్ కుమార్, హఫీజిల్లా, సుదర్శనం, లక్ష్మీకాంతమ్మ, రామకృష్ణ, ఆయేషా, వరలక్ష్మీదేవి, సరిత, రాజు విద్యాసంస్థల ప్రతినిధి రఘురామరాజు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంజీవ ప్రసాద్, వెంకటరమణ ,మహేశ్వర్ బాబు, సురేష్ కుమార్, నరసింహారావు, షఫీ ఉల్లా, పుల్లయ్య, శివ పనింద్ర ,మల్లీశ్వరి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరాజు, వెంకటసుబ్బయ్య, మహంకాలయ్య, లక్ష్మీకాంతమ్మ, వరలక్ష్మి దేవి, విజయలక్ష్మి, లక్ష్మమ్మ, శ్రీలత ,హిమ నైని, గాయత్రీ దేవి ,హిమామ్ భాష, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకొని ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని నైమిశారణ్య పీఠాధిపతి శ్రీశ్రీ బాల బ్రహ్మేంద్ర సరస్వతి స్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆలయంకు స్వామి హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీదేవి భాగవత అంతర్గత గంగమ్మ దేవత తత్వము గూర్చి ప్రవచనాలు, ఉపన్యాసాలు ధ్యానం గురించి వివరించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతన, హిందూ సాంప్రదాయక పద్ధతులు, విధ్నాలు అలవర్చుకోవాలన్నారు. రాష్ట్రంలో 300 దేవాలయాలు ఉన్నాయని, ప్రతి దేవాలయంలోనూ అమ్మవారి ప్రవచనాలు హిందూ ధర్మ కార్యక్రమాలు గురించి వివరిస్తున్నారు. ప్రతి మనిషి భగవంతుడిని ధ్యానం చేసుకోవాలన్నారు. మనిషి లోకం అంతర్గత ఆధ్యాత్మిక ప్రవచనాలు, భగవద్గీత, అమ్మవారి శతకాలు ప్రతిరోజు ధ్యానించుకోవాలని ఆయన భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామాల నర్సింహారెడ్డి, కార్యనిర్వహణ అధికారి రవీంద్రరాజు, ఆలయ ధర్మకర్తలు గంగయ్య, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరాముల నాయుడు సేవలు అభినందనీయం

విశాలాంధ్ర- రాయచోటిటౌన్: నారాయణరెడ్డి పల్లె బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గా ఎం.శ్రీరాములు నాయుడు అందించిన సేవలు అభినందనీయమని రాయచోటి పోస్టల్ ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు ఆదివారం తెలిపారు. జూన్ 31వ తేదీ పదవీ విరమణ సందర్భంగానారాయణరెడ్డి పల్లె బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ నందు ఆదివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు ఎప్పటికప్పుడు అందించారని కొనియాడారు. సంబేపల్లి సబ్ పోస్ట్ మాస్టర్ రమేష్ శ్రీరాముల నాయుడు ఉద్యోగం పట్ల చూపిన నిబద్ధతను కొనియాడారు. అనంతరం వారి దంపతులను బంధువులు పోస్టల్ సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, అల్లుడు బాబు నాయుడు కుమార్తెలు, బంధువులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆలయంకు ఆదివారం భక్తజనం పోటెత్తడంతో క్యూ లైన్‌లలో బారులు తీరి అమ్మవారి దర్శనం కోసం గంటలకొద్ది వేచి చూడాల్సి వచ్చింది. వేలాదిమంది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో సందడిగా మారడంతో జాతరను తలపించింది. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ఈవో రవీంద్ర రాజులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తన సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆలయ పూజారులైన ఆదిమూలం చంద్ర, రెడ్డి శేఖర్లు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, క్రైస్తవ, మైనార్టీలకు, రక్షణ ఎక్కడ?

- ప్రజాసంఘాల ఆగ్రహం

విశాలాంధ్ర-పీలేరు: దేశంలో మోడీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, క్రైస్తవ, మైనార్టీ లకు రక్షణ ఎక్కడ? అని ప్రజాసంఘాలు ప్రశ్నించాయి. పీలేరు పట్టణంలో స్థానిక అంబేద్కర్ కూడలి నందు అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసినివాళులర్పించారు.మాలమహానాడు మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి అనంద్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు దేశంలో మోడీ పాలనలో ఎస్సీ,ఎస్టీ, క్రైస్తవ, మైనార్టీలకు రక్షణ కరువైందని మదనపల్లి -తిరుపతి జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాస్ అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు గుండ్లురూ రాజేశ్వరి, మైనార్టీ మండల అధ్యక్షురాలు పఠాన్ హసీనా, ముస్లిమ్ జె.ఎ.సి,నాయకులు పఠాన్ మౌలా,అమీర్,మాలమహనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్,వి.సి.కె,పార్టీ, రాష్ట్ర సహాయ కార్యదర్శి,పాలకుంట శ్రీనివాసులు, బి.యస్.పి. పీలేరు నియోజకవర్గ ఇంచార్జి చీకటిపల్లి ఎర్రప్ప, ఏపీ ,యం. ఆర్.పి.యస్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వేలూరు గురునాథం, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్మికుల సంఘం అధ్యక్షులు ధనాసి వెంకట్రాయ్య,మాలమహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిగారి వెంకటస్వామీ,లు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో వివిధ రాష్ట్రాలలో ఎస్సీ,ఎస్టీ, క్రైస్తవ, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ఇటీవల మణిపూర్ లో గిరిజన మహిళలపై హత్యలు,హత్యాచారాలు,ప్రపంచ దేశాల ముందు తల దించుకునేలా చేశాయి ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఘటన సామాన్యుని కాదు సుప్రీంకోర్టు న్యాయమూర్తులనే దిగ్భ్రాంతికి గురి చేసింది మణిపూర్ లో పరిపాలన చేతకాక శాంతి భద్రతలు నసిస్తుంటే గత రెండు నెలలుగా బీజేపీ కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు మౌనం వహించి నీచ రాజకీయం చేస్తున్నాయి అసాంఘిక శక్తుల దూరాఘాతాలను స్పష్టంగా చూపుతున్నాయి ప్రజల ధన,మాన,ప్రాణాలను కాపాడవలసిన పోలీసులు, పేరా మిలటరీ దళాలు చేష్టలుడిగి చోద్యం చూస్తున్నాయి మణిపూర్ లో స్త్రీల మానాలకు, ప్రాణాలకు,రక్షణ లేకుండా పోయింది మానవత్వం మంటకలిసింది పశుప్రవర్తన పెచ్చు పెరిగిపోయిందని ఎస్సీ,ఎస్టీ, క్రైస్తవ, మైనార్టీలకు రక్షణ కరువైందని ప్రపంచానికి ఎలుగెత్తి చాటుతున్నాయని ఒక్క బీజేపీ పాలనలో తప్ప మన దేశ ప్రతిష్ట ఇంతగా దిగజారలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు కార్యక్రమంలో మాలమహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున,జాస్ జిల్లా లీగల్ అడ్వైజర్ గుండ్లురూ సదాశివ,మచ్చ రెడ్డప్ప, ముస్లిమ్ జె.ఎ. సి,నాయకులు ఖాదర్ వల్లి,సాదిక్, మౌలాలిసాబ్ తమీమ్,మేమునైతం సమాజం కోసం వ్యవస్థపకులు షేక్ షాహీన షా,మోద్దీన్ బాషా(బజ్జు),జాస్ అన్నమయ్య జిల్లా నాయకులుముల్లంగి క్రిష్ణయ్య, పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు ఎర్రబల్లి మల్లికార్జున,ఆరమడకల నాగరాజ, జాస్ నాయకులు మల్లికార్జున, సురేంద్ర, శంకర్ పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి

- తల్లికి వందనం పేరిట మహిళలకు పెద్దపీట
- ప్రతి ఇంటా ఆత్మీయ, ఆదరణ, ఆప్యాయతతో స్వాగతాలు
- అప్పుల కుప్పగా మారుతున్న ఆంధ్రప్రదేశ్
- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన టీడీపీ జాతీయనేత నల్లారి
- పీలేరులో పండుగ వాతావరణలో ఒకయజ్ఞంలా ఇంటింటికి 'నల్లారి'

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పట్టణంలోని పలు ప్రాంతాల్లోఇంటింటికి నల్లారి కార్యక్రమం ఒకయజ్ఞంలాకొనసాగుతుంది.పీలేరులో,తెలుగు తమ్ముళ్లు భారీ జన సందోహంతో గజమాలలతో

ఘన స్వాగతం పలికారు.టీడీపీ జాతీయనేత నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పట్టణంలోని ప్రతి ఇంటికివెళ్లి వచ్చే ఎన్నికల్లో టీడీపీ ప్రవేశపెట్టిన ఐదుకోట్ల ఆంధ్రుల "భవిష్యత్తు గ్యారంటీ" సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలు పంచారు. పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాస్,కావలి పల్లి పరిసరప్రాంతాల్లో కిషోర్ కుమార్ రెడ్డి రాకతో ప్రతి ఇంటా ఆత్మీయ, ఆదరణ,ఆప్యాయత స్వాగతాలు లభించాయి.నల్లారి అభిమానుల్లో ఉత్సాహం ఉప్పొంగి పండుగ వాతావరణం నెలకొంది.తల్లికివందనం పేరిట రాష్ట్రంలో మహిళలకు టీడిపి పెద్దపీటవేయనుందని, చదువుకొనే పిల్లలకు ఏడాదికి 15వేలు, దీపం పథకం కింద సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉమ్మడి జిల్లాల్లో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం లాంటి పథకాలతో ఐదుకోట్ల ఆంధ్రుల భవిష్యత్తు మారనుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అప్పుల కుప్పగా మారుతుందని రోజు రోజుకు అప్పులు తెస్తూ అనవసరమైన పథకాలతో జగన్మోహన్ రెడ్డి జనాలకు సోమరి పోతులుగా చేస్తున్నారని ఎదో ఒక సంక్షేమం ముందుకొస్తే చాలు జగన్మోహన్ రెడ్డి అప్పు తీసుకురావడం ఆనవాయితీగా మారిందని రాబోయే తరాల పరిస్థితి ఏంటని,తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,పీలేరు నియో జకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు.ఆదాయం సృష్టించి ఎన్ని సంక్షేమాలు పెట్టిన తమకు అభ్యంతరం లేదని, ఆదాయం సృష్టించడం చేతగాక అప్పులు చేసి పంచిపెడితే అది వెనకటికి ప్రజలపై పెనుభారంగా మారుతుందని ఆయనఅన్నారు.ఆంధ్రప్రదేశ్ ను అప్పులపాలుచేసే జగన్మోహన్ రెడ్డి కు భవిష్యత్తు తరాలు క్షమించవని,రాష్ట్ర భవిష్యత్తు తరాల గురించి ఆలోచనలేని జగన్మోహన్ రెడ్డికు పరిపాలించే అర్హత లేదని, ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఈకార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి బాబురెడ్డి,మాజీ జడ్పీటీసీ సభ్యులు మల్లెల రెడ్డిబాషా, మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర బీసీ సాధికారకమిటీ కార్యదర్శి పురం రామ్మూర్తి, రాజంపేట నియోజకవర్గ కార్యవర్గ కార్యదర్శి కుప్పం రవిచంద్రా రెడ్డి,యల్లెల రెడ్డెప్పరెడ్డి,మాజీమండలఅధ్యక్షులుఅమరనాథరెడ్డి,దళవాయి సురేష్ కుమార్ రెడ్డి,(కంచిసూరి) ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర,నియోజకవర్గ ప్రముఖనేత కొత్తపల్లి శ్రీనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర,కలికిరి గిరీస్ మద్దెల,వాసునూరి చంద్రశేఖర్,శివశంకర్, షామియాన జయన్న, కృష్ణయ్య,తెలుగు యువత అధ్యక్షులు నల్లారి రియాజ్,లక్ష్మీప్రసాద్, (చిన్న)ఫైరోజ్, మైనార్టీ నాయకులు ఛాన్ బాషా,షోఖత్,వైస్స ఖాదర్, పురుషోత్తం రెడ్డి,హనీఫ్, రెడ్డిబాషా,గాజుల రవికుమార్, రైతుసంఘంనాయకులు అమరనాథ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి, బుజ్జు,స్పోర్ట్స్ మల్లి,నియోజకవర్గ బిసిఅధ్యక్షులు వసంతలరాజా, గాండ్ల విజయ్ కుమార్, మొహమ్మద్ పీర్,ఆర్టీసీ నల్లగుట్ట మస్తాన్,సీనియర్ నాయకులు జాఫర్,సుబ్బయ్య, ఖాజాపీర్, రెడ్డిముని, బాబురమేష్,రాజా మహేష్, అబ్దుల్లా, రహంతుల్లా, అప్పస్వామి, రమాదేవి, అనూరాధ,లక్ష్మీ కాంతమ్మ,షమ,ఎర్రగుంట్లపల్లి అమరనాథ రెడ్డి, కప్పరం చంద్రయ్య, మిట్టమీద శివ,సోని బాషా,మహేష్ గంజి,మంజు,షఫీ,షరీఫ్,సురేష్, క్రాంతి, నాగరాజా, రవి నాయక్, వెంకట రమణానాయక్,అరటికాయల శేఖర్ పాల్గొన్నారు.

మహమ్మద్ సారథ్యంలో లయన్స్ క్లబ్ సేవలు అద్భుతం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: మహమ్మద్ అధ్యక్ష సారథ్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సేవలు అద్భుతంగా కొనసాగాయని ప్రముఖ వైద్యులు డా బయారెడ్డి, యస్డిహెచ్ఆర్ ఇన్స్టిట్యూట్ అధినేత రామ్ సునీల్ రెడ్డి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లు చిన్నప రెడ్డి, రమేష్ నాథ్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఫయాజ్ పంక్షన్ లో నందు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ పాత కార్యవర్గానికి వీడ్కోలు, నూతన కార్యవర్గాన్ని స్వాగతం పలుకుతూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ మహమ్మద్ అధ్యక్షులుగా ఏడాదిలోనే 650 సేవా కార్యక్రమాలు నిర్వహించి మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఇంత వరకు ఏ అధ్యక్షుడు ఇన్ని సేవా కార్యక్రమాలు చేయలేదని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని నూతన కార్యవర్గం కూడా సేవా కార్యక్రమాలు చేసేందుకు ఆసక్తి చూపాలని తెలిపారు. సేవా కార్యక్రమాల పట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం మంచిదన్నారు. తాను నిరంతరం సమాజ సేవకోసం తోడ్పడతానని మాజీ అధ్యక్షులు మహమ్మద్ పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సుధాకర్ రెడ్డి అధ్యక్షులుగా నిర్మల్ కుమార్, కార్యదర్శిగా షేక్ ఇందాద్ అహమ్మద్ ,కోశాధికారిగా హరీష్ చంద్ర లచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి సిఐ వరప్రసాద్, సంబెపల్లి, యస్ఐ షరీఫ్, ట్రాఫిక్ యస్ఐ మహమ్మద్ రఫీ లు మాట్లాడి లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. అనంతరం నూతన అధ్యక్షులు నిర్మల్ కుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫీస్ కోసం రూ 10 లక్షల విలువగల స్థలాన్ని ప్రకటించారు.సేవా కార్యక్రమాలు ముమ్మరం చేస్తానని తెలిపారు.అనంతరం లయన్స్ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తాడిపత్రి,కడప,పులివెందుల క్లబ్ సభ్యులతో పాటుగా రాయచోటి టౌన్ క్లబ్ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

మహిళా మార్ట్ విక్రయాలలో.. అన్నమయ్య జిల్లా ఫస్ట్

- మహిళా మార్ట్ తో ఆర్థిక స్వాలంబన
- నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకే విక్రయం
- జిల్లాలో రెండు మార్ట్ లు నిర్వహణ
- త్వరలో నాలుగు మార్ట్ లు ఏర్పాటు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత దిశగా ప్రభుత్వం వేస్తున్న అడుగులు సత్ఫలితాలుస్తున్నాయి. మహిళలను వ్యాపారవేత్త లుగా తీర్చిదిద్దేందుకు ప్రారంభించిన 'చేయూత మహిళా మార్ట్' లు విజయవంతంగా నడుస్తున్నాయి. మహిళ షేర్ హెూల్డర్ గా, వారి ఆధ్వర్యంలోనే ఈ మార్ట్ లను నిర్వహిస్తున్నారు. వీటిని ప్రత్యేక సొసైటీ ద్వారా పర్యవేక్షిస్తూ ఉండడంతో వ్యాపారం పారదర్శకంగా సాగుతోంది. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే నాణ్యమైన నిత్యవసర వస్తువులు విక్రయిస్తుండడంతో మహిళా మార్ట్ ను ప్రజలు ఆదరిస్తున్నారు. మహిళా మార్ట్ విక్రయాలలో అన్నమయ్య జిల్లా అగ్రస్థానంలో నిలుస్తోంది.

అన్నమయ్య జిల్లావ్యాప్తంగా 30,382 మహిళ స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 3,48,400 మంది సభ్యులు ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లో మహిళా మార్ట్ లను ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. మార్ట్ ఏర్పాటు చేసే ప్రాంతంలోని సంఘాల్లో ఉన్న సభ్యుల నుంచి ఉత్సాహవంతులైన పదిమందిని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకుంటారు. గత ఏడాది నవంబర్ నెలలో అన్నమయ్య జిల్లా వాయల్పాడులో మండల సమాఖ్య పరిధిలో 1,583 స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో రూ.38 లక్షల పెట్టుబడితో మహిళా మార్ట్ ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ మార్ట్ లో డ్వాక్రా ఉత్పత్తులతోపాటు బయట వస్తువులు కూడా బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే బ్రాండెడ్ సరుకులు, నాణ్యమైన నిత్యావసరాలు విక్రయిస్తున్నారు. తాజా ఉత్పత్తులకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. నిత్యవసరాలు సరఫరా చేసే రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చూస్తున్నారు. మహిళలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు సరసమైన ధరకే అందిస్తున్నారు. కేవలం నాలుగు శాతం నుంచి అయిదు శాతం మాత్రమే లాభం వేసుకొని సరుకులు విక్రయిస్తున్నారు. దీంతో అన్నితి కాలంలోనే మంచి ఆదరణ లభించింది. ఈనెల 20 తేది నాటికి ఈ మార్ట్ మొత్తం 246 రోజులపాటు పనిచేయగా, రోజుకు సగటున రూ.లక్షకు పైగా విక్రయాలు జరిగాయి. ఇప్పటివరకు రూ.1,57,14,830 మేర వ్యాపారం లభించింది. ఫలితంగా పొదుపు మహిళలకు ప్రయోజనం చేకూరుతుంది. రాష్ట్రంలోనే అధిక విక్రయాలు చేసే మార్ట్ గా వాయల్పాడు నిలిచింది. జిల్లాలో రెండు మార్ట్ లు ఏర్పాటు అయ్యాయి. త్వరలో నాలుగు మార్ట్ లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్థిక అభివృద్ధికి దోహదం

- నిర్మల, వాయల్పాడు మండలం, అన్నమయ్య జిల్లా

గ్రామ సమైక్య అందులో గాయత్రి గ్రూపులో మహిళా సభ్యురాలిని. మేము ఇక్కడ చేయూత మహిళ మార్ట్ ఏర్పాటు చేసుకున్నాము. డ్వాక్రా సంఘ సభ్యులు అందరమూ ఇక్కడ రూ.300 సభ్యత్వము వాటా ధనముగా కట్టించుకున్నారు. మేము అందరమూ ఇష్టంగా కట్టినాము. సంఘ సభ్యులందరము కలిసి ఈ మార్ట్ ను పెట్టుకున్నాము. నాణ్యమైన సరుకులు సరసమైన ధరలు మాకు అందుబాటులో ఉన్నవి దాని నుంచి వచ్చిన లాభాలు మా సంఘ సభ్యులకు ప్రతి సంవత్సరం ఆడిట్ జరిపి వచ్చిన లాభాలను తిరిగి మా సంఘ సభ్యులకు ఇవ్వడం జరుగుతుంది. అంతేకాకుండా ఈ మార్టు పెట్టినప్పుడు నుంచి కూడా సరుకులన్నింటివి కూడా రీజనబుల్ రేట్లలో ఉన్నవి. దీనికి జగనన్న మహిళ చేయూత తరపున పై అధికారులందరికీ ధన్యవాదాలు తెలుపు కుంటున్నాము. ఈ మార్టు ఇలా పెట్టడానికి కారణమైన ఏపిఎం నుంచి ఏసీ, పిడి, కలెక్టర్, రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదములు.

ప్రతి స్త్రీ మహిళా మార్ట్ పై ఆకర్షణ

- ఉమామహేశ్వరి, వాయల్పాడు మండలం, అన్నమయ్య జిల్లా.

నా పేరు ఉమామహేశ్వరి, వాయల్పాడు మండలం, అన్నమయ్య జిల్లా. విఓ 1 వాయల్పాడు సంఘ మిత్ర మహిళా సభ్యురాలిని. మా మండలంలో మొత్తం 10,000 గ్రూపులు ఉన్నవి. అందరము కలిసి ఒక్కొక్కరు రూ.300 వాటా ధనముగా వసూలు చేసి మార్ట్ పెట్టడం జరిగింది. ఈ మార్ట్ లో ప్రతి రోజు లక్ష రూపాయలకు పైగానే జరుగుతున్నది. మేము మా సంఘ సభ్యులు అందరము కలిసి నాణ్యమైన సరుకులు సరసమైన ధరలు మాకు అందుబాటులో ఉండే వస్తువులతో కొనుగోలు చేయుచున్నాము. దాంతో సంఘ సభ్యులు అందరికీ కూడా ఉపయోగకరంగా ఉన్నది. ఈ అవకాశం కల్పించిన అధికారులందరికీ ధన్యవాదాలు

మహిళా మాటల్లో మహిళా మాల్

- నాగవేణి, వాయల్పాడు మండలం, అన్నమయ్య జిల్లా.

మా మండలంలో వాయల్పాడు 37 విఓలు ఉన్నాయి. సంఘ సభ్యులు అందరూ కలిసి ఒక్కొక్కరు రూ.300 చొప్పున వైయస్సార్ చేయూత మహిళా మార్ట్ ఓపెన్ చేసినాము. మంచి మంచి సరుకులు నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకు దొరుకుచున్నాయి. ఒకటి తక్కువ ధరకు సరుకులు దొరకడం, రెండు ఈ సరుకులు వచ్చిన ఆదాయం ప్రతి రూపాయి దాని మీద వచ్చిన లాభాలు ఆడిట్ జరిగి తిరిగి మా సంఘ సభ్యులకు తిరిగి ఇవ్వడం జరిగింది. ఈ మార్ట్ వల్ల సంఘ సభ్యులు చాలా ఉపయోగకరంగా ఉన్నారు. సంతోషంగా ఉన్నారు.

ప్రతిరోజు లక్ష చొప్పున మహిళా మార్ట్

- మునిరత్నమ్మ, వాయల్పాడు మండలం అన్నమయ్య జిల్లా.

వాయల్పాడు మండలంలో మహిళా చేయూత మార్ట్ లాస్ట్ ఇయర్ నవంబర్ 28న స్టార్ట్ చేసినాము స్టార్ట్ చేసినప్పుడు నుంచి మార్ట్ అనేది ప్రతిరోజు ఒక లక్ష చొప్పున ఎక్కువగా జరుగుతున్నది. దీనివలన సభ్యులందరికీ మంచి లాభాలు జరుగుచున్నాయి. నాణ్యమైన ధరలకు నాణ్యమైన అతి తక్కువ ధరలకు నాణ్యతమైన వస్తువులు ఇస్తున్నాము. కాబట్టి సభ్యులందరూ ఇక్కడికే వచ్చి నిత్యవసర సరుకులు కొనడం జరుగుతుంది. ప్రతి ఒక్కరూ సభ్యురాలు కూడా రేటు ఇక్కడే తెలుసుకోవడం జరుగుతుంది. ఇంట్లో భర్త చేత కాకుండా ఇంట్లో మహిళా సభ్యులు స్వయంగా వచ్చి చేయూత మార్టు వలన సంఘ సభ్యులందరికీ కూడా చాలా మంచిగా ఉంది. మంచి ధరలకు మంచి నాణ్యత లభిస్తుంది. అందరికీ కూడా చేయూత మహిళా మార్ట్ నడిపిస్తున్న సభ్యురాలు అందరికీ కూడా ధన్యవాదాలు.

మహిళల ఆర్థిక స్వయం సమృద్ధే లక్ష్యం

- అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్:

మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ సహకారంతో జిల్లాలో డ్వాక్రా మహిళలు బలమైన ఆర్థికశక్తులుగా అభివృద్ధి పథంలో వెళుతున్నారు. మండల సమాఖ్యల ఆధ్వర్యంలో జీవనోపాధి కార్యకలాపాలు మరింత ముమ్మరం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా మరిన్ని మహిళా మార్ట్ల పేరుతో సూపర్బజార్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మహిళా మార్ట్ లు దోహదపడతాయి. జిల్లాలోని మహిళా మార్ట్ ల ద్వారా మహిళాలు లాభాలు గడిస్తున్నారు. జిల్లాలో మరిన్ని మహిళా మార్ట్ లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

జగనన్నా...! ఇదేందన్నా జగన్మాయా...!

- బటన్ నొక్కుడే గాని పడుటలేదే...!
- నాలుగో విడత వేస్తూ ఐదో విడతని నేతన్నలకు కుచ్చు టోపీ...
- పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులుమాసా కోదండ రామ్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : సబ్సిడీలు, స్వయం ఉపాధి, ప్రోత్సాహకాలు రద్దు చేసి బటన్ నొక్కి మీ బతుకులు మార్చేస్తున్నా... అనడం సిగ్గుచేటని.. నేతన్నలపై జగన్రెడ్డి నీతిలేని రాజకీయం చేస్తున్నారని మాసా కోదండ రామ్ ధ్వజమెత్తారు. ఆదివారం కడప నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో టీడీపీ పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మాసా కోదండ రామ్ మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు దాటి అయిదో సంవత్సరం జరుగుతుంటే నేతన్న నేస్తంకింద అయిదో విడత డబ్బులేస్తున్నానని ముఖ్యమంత్రి గారేమో వెంకటగిరిలో జరిగిన బహిరంగ సభలో పట్టపగలే ప్రజల సమక్షంలో పచ్చి అబద్ధాలాడుతున్నారని ఎద్దేవాచేశారు. నేతన్న నేస్తం పథకం కింద.. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 81 వేల మందిని అర్హులుగా పేర్కొని, ఇప్పుడు 80 వేల మంది మాత్రమే అర్హులు అనడంలో మతలబు ఏంటి..? ఏడాదిలో వెయ్యి మగ్గాలు ఏమైనట్లు...? మగ్గాలు తగ్గాయా..? లేక మగ్గంపై పని చేసే వారు తగ్గారో.. ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. అందరికీ అందే పథకాలనే నేతన్నలకూ ఇస్తూ అదే మహాద్భుతం అనేలా జగన్ రెడ్డి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. నాలుగేళ్ల పాలనలో వంద మందికిపైగా చేనేత కళాకారులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారని, జగన్రెడ్డి ముఠా పదుల సంఖ్యలో నేతన్నలను కిరాతకంగా చంపేస్తే ఏ రోజు కూడా నోరెత్తని పాపాన పోలేదని విమర్శించారు. తాజాగా ధర్మవరానికి చెందిన శశి అనే నేతన్నను జగన్రెడ్డి రౌడీ మూక విజయవాడలో బట్టలూడదీసి కొడితే ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నేతన్నలను చిన్నచూపు చూస్తున్నా.. నేతన్నలను ఉద్ధరించేశానని జగన్రెడ్డి చెప్పుకునేందుకు సిగ్గుపడాలన్నారు. అందరికీ ఇచ్చే పథకాలే నేతన్నలకు అందిస్తున్న ప్రభుత్వం.. ప్రత్యేకంగా చేనేత కళాకారుల కోసం అమలు చేస్తున్నట్లు కలరింగ్ ఇవ్వడం దుర్మార్గమన్నారు. చేనేతలకు రూ.5 లక్షల చంద్రన్న బీమా సదుపాయం కల్పించిన ఘనత టీడీపీదే.. టీడీపీ హయాంలో నేతన్నల సంక్షేమం కోసం ఏటా రూ.250 కోట్ల బడ్జెట్ కేటాయించామని, రూ.110 కోట్ల రుణాలు మాఫీ చేయడం జరిగిందని స్పష్టం

చేశారు. 90,765 కార్మికులకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామన్న... కార్పొరేషన్ల ద్వారా రూ.2 లక్షల వరకు సబ్సిడీ రుణాలిచ్చామని పేర్కొన్నారు. నూలు, రంగులపై 40 శాతం సబ్సిడీ ఇచ్చామని, మరమగ్గాలు ఏర్పాటు చేసుకునే కార్మికులకు 50శాతం వరకు రాయితీలు అందించామన్నారు. 1.11లక్షల మందికి రూ.2000 చొప్పున పెన్షన్ అందించి త్రిఫ్ట్ పథకం అమలు చేశామన్నారు. ఆప్కో ద్వారా వస్త్రాలు కొనుగోలు చేసి అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పించామని.. ఆదరణ ద్వారా 60 వేల మందికి పనిముట్లు అందించామన్నారు. 70 వేల మగ్గాలకు మోటార్లు ఏర్పాటు చేయడంతో పాటు... 70వేల మగ్గాలకు జకార్డ్ లిఫ్టింగ్ సదుపాయం కల్పించాం. చేనేత వస్త్రాలపై 5% పన్ను రద్దు చేశామని, రూ.300 కోట్లతో వెంకటగిరిలో సిల్క్ పరిశ్రమ ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. సొంత మగ్గం ఏర్పాటు చేసుకునే వారికి రూ.2 లక్షల రుణాలు అందించడంతో పాటు మగ్గం ఆధునికీకరణకు సహకరించామన్నారు. మరణించిన నేతన్నలకు రూ.5 లక్షల చంద్రన్న బీమా సదుపాయం కల్పించామని, మల్బరీ తోటల పెంపకాన్ని ప్రోత్సహించామన్నారు. జగన్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చాక ఈ పథకాలు, సబ్సిడీలు ఎత్తేసి బటన్ నొక్కుతున్నా, మీ బతుకులు మార్చేస్తున్నా అంటూ యధేచ్చగా ప్రజల సాక్షిగా అబద్దాలు చెబుతున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సాధికార సమితి రాజంపేట పార్లమెంటు కన్వీనర్ ఆలూరు వెంకట సుబ్బయ్య, కడప పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గుర్రం నటరాజా, ఒంటిమిట్ట మండల టీడీపీ బిసి సెల్ అధ్యక్షుడు నామాల వెంకటయ్య, పద్మశాలీ సాధికార సమితి కడప, రాజంపేట,సభ్యులు బిట్రా చంద్ర శేఖర్, మామిళ్ల కృష్ణమూర్తి, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

23 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని చెన్న ముక్క పల్లి గ్రామం లో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 23 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గం తో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట రైల్వే కోడూరు ఎర్రవారిపాలెం కె.వి పల్లె కలకడ కలికిరి గుర్రంకొండ పెద్దమండెం ఎన్ పి కుంట చక్రాయపేట కదిరి వేంపల్లి తదితర ప్రాంతాల నుండి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 23 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు.అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా,అద్దాలు మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి,లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాష పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అంతిమ యుద్ధానికి సిద్ధం కావాలి

- మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి
- ఎంఆర్పిఎస్ జాతీయ అధ్యక్షులు ముస్నంగి నాగరాజు మాదిగ

విశాలాంధ్ర-పీలేరు: మాదిగల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు మాదిగలంతా అంతిమ యుద్ధానికి సిద్ధం కావాలని, వర్గీకరణ సాధించే బాటలో ఆగస్టు రెండవ వారంలో హైదరాబాదులో 30 లక్షల మంది మాదిగల తో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహా సభకు తరలి వెళ్లి సభను జయప్రదం చేయాలని, ఎం ఆర్ పి ఎస్ జాతీయ అధ్యక్షులు ముస్నంగి నాగరాజు తెలిపారు. ఆదివారం పీలేరు నియోజకవర్గ స్థాయిలో పీలేరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు ముస్నంగి నాగరాజు మాదిగ పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి నాగరాజు మాదిగ మాట్లాడుతూ ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణ కోసం గత 29 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి కూడా అధికారంలోకొచ్చి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు వర్గీకరణ చేయకుండా జాప్యం చేస్తూ మాదిగలను ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు అటు టిఆర్ఎస్ ఇటు వైకాపా పార్టీలు కూడా ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ కూడా ఎస్సీ వర్గీకరణ న్యాయమైన అంశంగా చెబుతూనే వర్గీకరణ కోసం బిల్లులు పెట్టడంలో జాప్యం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ న్యాయమైన అంశంగా చెబుతూనే అసెంబ్లీ తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించడంలో విఫలం చెందుతూ మాదిగలకు ద్రోహం చేస్తున్నారు. కడప ఉమ్మడి జిల్లాల ఎం ఎస్ పి ఇంచార్జ్ కే ఎన్ రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రస్థాయి నాయకులను మొదలుకొని జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు మాదిగలను విశ్వరూప మహాసభకు తరలించేందుకు అన్ని విధాల సిద్ధం కావాలని తెలిపారు. ఈ సమావేశంలో కడప ఉమ్మడి జిల్లాల ఎం ఎస్ పి ఇన్చార్జ్ కే ఎన్ రాజు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ దుద్దు రామకృష్ణ, అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బండ కింద మనోహర్, ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిబాబు , ఎం ఆర్ పి ఎస్ సీనియర్ నాయకులు గండికోట వెంకటేష్, ఎం ఎస్ పి నాయకులు సుధాకర్ బాబు, ప్రేమ్ కుమార్, ఎం ఆర్ పి ఎస్ నాయకులు ఎర్రయ్య, గురవయ్య, విశ్వనాథ, వెంకటరమణ, రెడ్డప్ప, వెంకటా చలపతి ,ఆంజనేయులు, హరినాథ్ రెడ్డి కుమార్, చరణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా రాయచోటి జోన్ పిఆర్టియు సమావేశము డైట్ ఉన్నత పాఠశాల రాయచోటి నందు నిర్వహించబడినది. ఈ సమావేశము నందు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మరియు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము ఉపాధ్యాయులకు చెల్లించవలసిన పిఆర్సి బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు గతంలో ఎన్నడూ లేని విధంగా పిఆర్సి బకాయిలు చెల్లించక ముందే మరొక పి ఆర్ సి కమిటీ వేయడం విడ్డూరంగా ఉందన్నారు తక్షణమే పిఆర్సి బకాయిలు చెల్లించి పాత డీఏ లు అన్నింటిని కలిపి వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల కు ప్రతి ఆరు నెలలకు రావలసిన డీఏ లను చెల్లించి ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పాఠ్యాంశాలు బోధించే విధంగా చూడాలన్నారు జిల్లా మరియు రాష్ట్రస్థాయి అధికారులు జీవోలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల పై వచ్చేటువంటి ఆరోపణలు వాస్తవాల అవాస్తవాలు అని తెలుసుకోకుండా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సస్పెన్షన్ చేయడం చాలా దారుణం అన్నారు అధికారం ఉంది కదా అని ఉపాధ్యాయులను బెదిరిస్తే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుంది అన్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమాల ద్వారా ఒక చక్కటి వాతావరణం పాఠశాలలో కల్పిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. విద్యార్థుల సంఖ్య తో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేటట్లు చూడాలన్నారు పది రోజులలో ఎఫ్ ఏ వన్ ఎగ్జామ్స్ ప్రారంభం కాబోతున్నప్పటికీ ఇప్పటికీ ఉపాధ్యాయుల కొరత పాఠశాలలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయన చూపిన దారి.. నాకు రహదారి

- స్వార్థ రాజకీయాలల్లో.. రాజీ పడే ప్రసక్తే లేదు
- అధినేత చంద్రబాబు అడుగుజాడల్లో నడుస్తా..
- టిడిపి అధికారంలోకి రాగానే రాజంపేట దిశ.. దశ మారుస్తా
- నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా
- పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం
- నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటా
- టిడిపి నియోజకవర్గ నాయకులు చమర్తి

విశాలాంధ్ర-రాజంపేట: రాష్ట్ర రాజకీయాలనే శాసించే సత్తా రాజంపేటకు ఉందని 2024 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే, అధినేత చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పనిచేస్తూ, ఆయన అడుగుజాడల్లో రాజంపేట నియోజకవర్గ దిశా.. దశ మారుస్తానని ప్రముఖ విద్యావేత్త, నియోజకవర్గ సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు తన అభిప్రాయాన్ని వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎవరైతే ఆశావహులు పార్టీలోకి చేరుతున్నారో.. స్వార్థ రాజకీయ వర్గీయులతో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. అంతిమంగా చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యమని, అధినేత సూచన మేరకే నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టత కోసం, గెలుపే లక్ష్యంగా కార్యకర్తలతో కలిసి ఒక సైనికుడిగా చిత్తశుద్ధితో పని చేయడం జరుగుతున్నారు. గడిచిన నాలుగేళ్లలో టిడిపి అధికారంలో ఉన్న లేకున్నా.. పార్టీ శ్రేయస్సు కోసం.. కార్యకర్తల సంక్షేమం కోసం నిత్యం వారికి అందుబాటులో ఉండడం జరుగుతుందన్నారు. అధినేత చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై, నియోజకవర్గ ప్రజల తరపున రాజీలేని పోరాటాలను చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోనే రాష్ట్ర రాజకీయాలను శాసించే రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలపడింది. దీనికి ప్రధాన కారణం పార్టీని సంస్థాగతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లడం వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి చంద్రబాబు ఆశయాలను వివరించడం జరిగిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాజంపేట నియోజకవర్గానికి 800 కోట్లు నిధులు కేటాయించి చంద్రబాబు నాయుడు అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి సామాన్య ప్రజలపై ధరల భారం మోపిందన్నారు. ప్రతి పార్లమెంట్ కేంద్రాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇటువంటి నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు చంద్రబాబు పరిపాలనను కోరుకోవడం జరుగుతోందన్నారు.

స్వార్థ రాజకీయాలల్లో.. రాజీపడను

రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టత బలంగా ఉందని, స్వార్థ రాజకీయ వర్గీయులతో ఎటువంటి పరిస్థితుల్లో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పేశారు జగన్ రాజు. తాను మొదటి నుండి తెలుగుదేశం పార్టీ విధేయుడుగా, చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా ఆయన అడుగుజాడల్లోనే పార్టీ కోసం అహర్నిశలు పనిచేయడం జరుగుతుందన్నారు. నా భవిష్యత్తు కార్యాచరణ అధినేత చేతుల్లోనే ఉందని, అంతిమంగా ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా.. శిరస్సు వంచి పార్టీ కోసం కట్టుబడి పనిచేస్తానన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ఆరు మండలాల్లో పార్టీ క్యాడర్ బలంగా ఉందని, అధినేత ఆదేశిస్తే రాజంపేట కేంద్రం నుండి పోటీ చేసి విజయకేతనం ఎగరవేసి తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభోగాన్ని తీసుకొస్తామని, ఆదిశగానే ముందుకు సాగడం జరుగుతోందన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం..

రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ గాలి వీస్తుందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు తథ్యం అన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్రకు, భవిష్యత్తుకు భరోసా గ్యారెంటీ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నటువంటి రాజంపేట నియోజకవర్గాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు తీసుకు తీసుకెళ్తామన్నారు. ప్రధానంగా నిరుద్యోగ యువతకు ఆదుకునేందుకు పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను కల్పించడమే తమ ముందున్న ప్రధాన కర్తవ్యం అన్నారు.

అన్నివేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటా..

కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పట్టుకొమ్మలాంటి వారని, వారి సంక్షేమం కోసం అన్నివేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం ఆవిర్భవించినప్పటి నుండి స్వర్గీయ ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి వారికి అండగా నిలిచిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. అదే స్ఫూర్తితో నియోజకవర్గంలో ఉన్నటువంటి ప్రతి కార్యకర్తకు భవిష్యత్ భరోసా ఇవ్వడం జరుగుతోందన్నారు.

నవాబు కోట హత్య కేసులో నిందితుడి అరెస్టు ..రిమాండ్

విశాలాంధ్ర-మదనపల్లి: సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కేశప్ప,పిటిఎం మండలం నవాబు కోట గ్రామంలో ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి సమయంలో జరిగిన హత్య కేసు వివరాలకు సంబంధించి మధుకర్ రెడ్డి వయస్సు (30) తండ్రి శివరామిరెడ్డి నవాబు కోట గ్రామం ఇతను తన సొంత వ్యవసాయ పొలంలో గుడిసెలో నిద్రిస్తుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తన కుమారుని గొంతు కోసి చంపారని మృతుడు తండ్రి శివరామిరెడ్డి ఫిర్యాదు మేరకు ఈనెల 17వ తేదీన తేదీన పిటిఎం పోలీస్ స్టేషన్లో హత్య కేసుగా నమోదు చేసి మొలకలచెరువు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ సాదిక్ అలీ, ఎస్సై రవీంద్ర, సిబ్బంది, టెక్నికల్ బృందం గత వారం రోజుల నుండి సుమారు 25 మందిని విచారించగా సదురు కేసును రీ కన్స్ట్రక్షన్ చేసుకుంటూ విచారించగా సదరు గ్రామానికి చెందినటువంటి సిపి రెడ్డప్పరెడ్డి అలియాస్ రెడ్డప్ప మధుకర్ రెడ్డిని కత్తితో గొంతు కోసి హత్య చేశాడని కారణాలు విచారించగా సదర కేసులో హంతకుడైన సిపి రెడ్డప్పరెడ్డి అలియాస్ రెడ్డప్పకు సదరు గ్రామంలో సుబ్బమ్మ అనే మహిళతో సుమారు 13 సంవత్సరాలుగా అక్రమ సంబంధం ఉండినదని.సదరు సుబ్బమ్మతో గత కొంతకాలంగా మృతుడు మధుకర్ రెడ్డి అక్రమ సంబంధం కలిగి ఉన్నాడని సదరు విషయమై గ్రామంలో చాలామందితో చెప్పుకొని సిపి రెడ్డప్ప బాధపడ్డాడని.ఇతను కూడా ట్రాక్టర్ డ్రైవర్ గా వృత్తిని కొనసాగిస్తూ జీవనం కొనసాగించే వాడని.ఈ హత్య జరగకముందు వారం రోజులు ముందే సదరు గ్రామానికి చెందిన అంజిరెడ్డి సహాయంతో సిపి రెడ్డప్ప రెడ్డి మధుకర్ రెడ్డిని హత్య చేసేందుకు ప్రయత్నించాడనిఆ సమయంలో మధుకర్ రెడ్డి మెలుకువతో ఉండగా తన ప్రయత్నం విఫలమైందని తరువాత.16వ తేదీన మధుకర్ రెడ్డి తన సొంత పొలంలో ట్రాక్టర్ నడిపి మద్యం సేవించి పడుకుని ఉండగా పథకం ప్రకారం సీపీ రెడ్డప్ప రెడ్డి అలియాస్ రెడ్డప్ప మధుకర్ రెడ్డిని గొంతు కోసి చంపాడని.తను కొన్ని సంవత్సరాలుగా తాను అక్రమ సంబంధం పెట్టుకున్న సుబ్బమ్మను మధుకర్ రెడ్డి అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అక్కసుతోనే ఈ హత్య జరిగినట్లు.హత్యకు ఉపయోగించిన కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నామని. సాంకేతికపరమైన ఆధారాలు మరియు ఖచ్చితమైన సమాచారంతోనే ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్కు పంపుతున్నామని.ఈ హత్య కేసులో ఇంకేమైనా విషయాలు ఉన్నాయనేది తదుపరి దర్యాప్తులోభాగంగా పరిశీలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. పిటిఎం మండలంలో సంచలనాత్మకమైన ఈ హత్య కేసును ఛేదించిన మొలకలచెరువు సర్కిల్ ఇన్స్పెక్టర్ సాదిక్ అలీ పిటిఎం ఎస్సై రవీంద్ర ను, టెక్నికల్ టీంను డిఎస్పీ అభినందిస్తూ రివార్డు కోసం అన్నమయ్య జిల్లా ఎస్పీ సిఫారసు పంపిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.